జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | బుధవారం 13 మే 2026 | సంపుటి: 19 | సంచిక: 66 | పేజీలు: 21 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , జ్యేష్ఠ మాసము , తిథి: అష్టమి - 15:09:36 వరకు నక్షత్రంధనిశ్ఠ - 24:50:46 వరకు కరణంకౌలవ - 15:09:36 వరకు, తైతిల - 27:24:43 వరకు పక్షంకృష్ణ యోగంబ్రహ్మ - 26:07:47 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL   http://www.prajajyothinews.com   Mail: prajajyothidaily@gmail.com

## ఉదయనిధి మరోమారు అనుచిత వ్యాఖ్యలు

**సనాతన ధర్మంపై నోరు పారేసుకున్న డిఎంకె నేత**

**ఉదయనిధి వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి నేత**

చెన్నై,మే12(ప్రజాజ్యోతి): తమిళనాడు మాజీ ఉప ముఖ్యమంత్రి, డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ మరోసారి సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. మూడేళ్ల క్రితం ఉదయనిధి సనాతన

మిగతా1 2లో..

## కవితకు రైల్వే కోర్టు సమన్సు

**కామారెడ్డిలో రైల్‌రోకో కేసు..**

**నేడు సికింద్రాబాద్ కోర్టుకు హాజరు కావాలని ఆదేశం**

హైదరాబాద్,మే12(ప్రజాజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల డిమాండ్ చేస్తూ నిర్వహించిన రైల్ రోకో కార్యక్రమం కేసులో తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు సమన్లు జారీ అయ్యాయి. బుధవారం విచారణకు హాజరు కావాలని సికింద్రాబాద్ రైల్వే

మిగతా 2లో..

# నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

## పేపర్ లీక్ వ్యవహారంతో ఎన్‌టిఎ నిర్ణయం

### సిబిఐ విచారణకు ఆదేశించినట్లు వెల్లడి

### 13మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

న్యూఢిల్లీ,మే12(ప్రజాజ్యోతి): జాతీయ అర్హత పరీక్ష నీట్ యూజీ–2026ను రద్దు చేసారు. పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం రాజస్థాన్‌లో లీకైనట్లు వచ్చిన వార్తలు పెనుదుమారం రేపాయి. ఈ నేపథ్యంలో జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా మే 3న జరిగిన నీట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే కొత్త పరీక్ష తేదీలను

మిగతా 12లో..



## లక్షల మంది విద్యార్థుల కలలు కల్లలు

### నీట్ పరీక్ష రద్దుపై మండిపడ్డ రాహుల్

న్యూఢిల్లీ,మే12(ప్రజాజ్యోతి): నీట్ ప్రశ్నాపత్రం లీక్ కారణంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని లక్షల మంది కష్టాన్ని, కలల్ని బీజేపీ ప్రభుత్వం ఛిద్రం చేసిందని విమర్శించారు. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదని, యువత భవిష్యత్తును కాలరాసే నేరమని ఆరోపించారు.

మిగతా 12లో..



## తమిళ సీఎం విజయ్ సంచలన నిర్ణయం

- బడులు, గుడులు, బస్టాండ్ల వద్ద వైన్ షాప్‌ల ఎత్తివేత
- రెండువారాల్లోగా మూసేయాలంటూ ఆదేశాలు
- విజయ్ సోషల్ మీడియాకు పెరుగుతున్న ఆదరణ
- తమిళనాట బ్యానర్లు ఫ్లెక్సీలు బ్యాన్
- అభిమానులకు సీఎం విజయ్ ఆదేశం

చెన్నై,మే12(ప్రజాజ్యోతి): తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు, దేవాలయాలు, బస్‌స్టాండ్స్‌కి 500 మీటర్ల దూరంలో ఉన్న 717 వైన్ షాపులన్నింటినీ క్లోజ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ దుకాణాలను రెండు

మిగతా 12లో..

## తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా జేసీడీ ప్రభాకర్

### డిప్యూటి స్పీకర్‌గా రవిశంకర్ ఎన్నిక

చెన్నై,మే12(ప్రజాజ్యోతి): తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా టీవీకే ఎమ్మెల్యే జేసీడీ ప్రభాకర్ మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీవీకేకు చెందిన మరో ఎమ్మెల్యే రవిశంకర్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కోసం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు ప్రోటెం స్పీకర్ ఎంవీ కరప్పయ్య తెలిపారు. తొలుత ప్రభాకర్ నామినేషన్‌ను

మిగతా 2లో..

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

- సజావుగా వరి, మొక్కజొన్న కొనుగోళ్లు
- ధాన్యం వెంటనే లారీల్లో తరలించాల్సిందే
- అవసరమైతే పోలీస్ సాయంతో ధాన్యం సేకరణ
- లారీలు పంపకుంటే క్రిమినల్ కేసులు పెట్టండి
- కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు

రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, జిల్లా కలెక్టర్లు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని ఆదేశించారు. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్‌కు తరలించాలన్నారు.



హైదరాబాద్,మే12(ప్రజాజ్యోతి): ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దని.. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకు వెనకాడవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దని తెలిపారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. మంగళవారం.. జిల్లా కలెక్టర్లతో

మిగతా 2లో..

## చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణ

### ప్రత్యేక దృష్టి సారించిన తెలంగాణ ప్రభుత్వం

### అధికారులతో మంత్రి కొండా సురేఖ సమీక్ష



హైదరాబాద్,మే12(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో చెరువులు, సరస్సులు, వెట్‌ల్యాండ్స్ పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల సమీక్షా సమావేశం మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వెట్‌ల్యాండ్స్ అథారిటీ కార్యకలాపాలు, వెట్‌ల్యాండ్స్ కాలుష్య నియంత్రణపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలోని చెరువులు, సరస్సుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సమగ్ర వివరాలు సమర్పించారు. ఈ సమావేశానికి అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్ శాఖల ఉన్నతాధికారులు

మిగతా 2లో..

# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ

### రెండోవిడతపై 21న కేబినేట్‌లో ఖరారు చేస్తాం

### స్పెషల్ డ్రైవ్ ద్వారా డబుల్ ఇళ్లు పంపిణీ

### అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి




హైదరాబాద్,మే12(ప్రజాజ్యోతి): రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని చెప్పారు. మంగళవారం గృహనిర్మాణశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల విధివిధానాలను ఈనెల 21న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఖరారు చేస్తామని పొంగులేటి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థలాలు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్

మిగతా 2లో..

## భగీరథకు సిట్ నోటీసులు

- నేడు విచారణకు రావాలని ఆదేశం
- హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్
- 14న విచారించనున్న వెకేషన్ బెంచ్
- చట్టానికి నా కొడుకు అతీతుడేమీ కాదు
- కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టీకరణ



హైదరాబాద్,మే12(ప్రజాజ్యోతి): కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం భగీరథ్‌కు

మిగతా 12లో..

## అసోం సీఎంగా హిమంత బిశ్వశర్మ

- ప్రమాణ కార్యక్రమానికి ప్రధాని హాజరు
- ఎన్డీయే ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు రాక



గౌహతి,మే12(ప్రజాజ్యోతి): అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వశర్మ ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో వరుసగా రెండోసారి సీఎం పదవిని చేపట్టిన తొలి భాజపా నేతగా హిమంత నిలిచారు. ఆయనతో పాటు మరో నలుగురు మంత్రులు ప్రమాణం చేశారు. ఉదయం 11.40 గంటలకు గువాహటిలోని వెటర్నరీ కాలేజీ ఫీల్డ్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్

మిగతా 12లో..

## నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనది

## వారి సేవలు చిరస్మరణీయం

### వారిది ఉదయోగం కాదు.. నిరంతర సేవ

### నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందచేత

### వారి సేవలు నిరుపమానమని అన్న మంత్రి దామోదర

హైదరాబాద్,మే12(ప్రజాజ్యోతి): ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు పొందిన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలు అందజేశారు. కోఠి ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన

మిగతా 2లో..



# సంపాదకీయం

## ఖర్చులు తగ్గింపు... మోడీ నుంచే మొదలవ్వాలి !

మంచో చెడో...ప్రధాని మోడీ చేసిన ఓ సూచన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇంకా మారాల్సి ఉంది. దీనిపై పైనుంచి కింది వరకు చర్చించాలి. అదేంటంటే ఖర్చులు తగ్గించాలి. బంగారం కొనగూడదు.. ఇంధనం తగ్గించుకుని వాహనాలను మూలన పెట్టాలి. లేదా తక్కువ మోతాదులో ఇంధనం వాడుకోవాలి. దేశహితం కోసం ఇది మంచిదే. అయితే ఎవరు ఖర్చులు తగ్గించాలన్నదే ముఖ్యం. దేశ అర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి ముందుగా ఖర్చుల జాబితాను రూపొందించి తగ్గించాలి. ప్రధాని మొదలు, ఎమ్మెల్యేల వరకు ఖర్చులు తగ్గించే ప్రయత్నం నేటినుంచే మొదలు పెడితే మంచిది. ఇందులో ప్రధానంగా రాజకీయ నాయకలు నుంచి తగ్గింపు మొదలైతే దేశం దరిద్రం పోతుంది. ముందుగా వారి జీతభత్యాల్లో కోత పెట్టాలి. వేలకోట్ల జీతభత్యాలు, విమాన ఖర్చులు, కార్లు, కాన్వాయ్‌ల ఖర్చులు వెంటనే కోత విధించాలి. ప్రధాని పిలుపు మేరకు దేశ ప్రజలు ఇంధన వినియోగం, బంగారం కొనుగోళ్లు, వంట నూనెల వినియోగం 10 శాతం తగ్గించుకుని, ఎరువుల దిగుమతులను 50శాతం మేర తగ్గించి, అనవసర విదేశీ పర్యటనలను మానుకుంటే.. ఏడాదిలో 4500 కోట్ల డాలర్ల మేర విదేశీ మారక ద్రవ్య నిల్వలను ఆదా చేయొచ్చని ఒక అంచనా. అంటే మన కరెన్సీలో దాదాపుగా రూ.4.3 లక్షల కోట్లు అన్న మాట. ఇది మంచి సలహా గనక ఎవరు తగ్గించుకోవాలన్న చర్చ మొదలు పెట్టాలి. అందుకే రాజకీయంగా అవుతున్న దుబారాను ముందుగా తగ్గించాలి. ఈ ఖర్చులు తగ్గితే విదేశీ మారకం నిల్వలు పెరుగుతాయి. దేశ జిడిపి పెరుగుతుంది. ప్రజలకు నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు దక్కుతాయి. రాజకీయ నాయకులు జీతభత్యాలు, కార్లు, విమానాలు, హెలికాప్టర్ల ఖర్చులు, అనవసరంగా విదేశీ టూర్లు, ఉచిత పథకాలు వంటివన్నింటిపైనా బ్యాన్ విధించాలి. ముందుగా ప్రధాని మోడీ టూర్లు తగ్గాలి. సిఎంల ప్రమాణాలకు సిఎంలను, కేంద్రమంత్రులను పిలవడం వల్ల ఎంత ఖర్చయ్యిందో లెక్కలు చెప్పాలి. అట్టహాసపు ప్రమాణ స్వీకారాల ఖర్చును దేశంపై రుద్దడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. చంద్రబాబు లాంటి వారు హెలికాప్టర్లు వేసుకుని పెన్షన్లు పంచడానికి వెళ్లడాన్ని నిషేధించాలి. అనవసర ఖర్చులతో రాష్ట్ర ఖజనాలను గుల్లచేసిన వారినుంచి ఆ మొత్తాలను రాబట్టాలి. ఇందుకోసం ఎంతటి కఠిన నిర్ణయమైనా తీసుకున్నా ఫర్వాలేదు. దేశ ఆర్థిక వ్యవస్థ బాగా ఉందంటే...అందుకు విదేశీ మారక నిల్వల మొత్తమే రుజువు. విదేశీ మారక ద్రవ్య నిల్వలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. ఒక దేశం ఎంత ధనికమైనది, ఎంత సురక్షితమైనది అని చెప్పడానికి ఈ ఫారెక్స్ రిజర్వులు కొలమానం లాంటివి. ఇవి తగ్గుతాయంటే మనం దిగుమతులను తగ్గించాలి. మన వ్యవసాయ ఉత్పత్తులను విదేశాలకు అమ్ముకోవాలి. ఇక్కడ రైతులు ధాన్యం కొనుగోళ్లు లేక దిగాలు పడుతున్నారు. అందువల్ల దేశీయంగా ఉత్పత్తి అయిన వస్తువులను వాడుదాం. అప్పుడు కూడా భారీగా ఖర్చులు తగ్గుతాయి. మోడీ ఇచ్చిన సలహాలను పాజిటివ్‌గా తీసుకుంటే మంచిదే. అయితే ఇది రాజకీయ నాయకులకు మాత్రమే హెచ్చరిక కావాలి. వారే తమ ఇంటి నుంచి సంస్కరణలు ప్రారంభించాలి. ఇకపోతే ప్రధాని మోదీ తన ప్రసంగంలో బంగారం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడానికి కారణం ఏంటంటే.. భారతీయులు ఏడాదికి సగటున కొనే పసిడి దాదాపు 700-900 టన్నులని అంచనా! దీని విలువ సుమారు రూ.13.69 లక్షల కోట్లు. 2024-25తో పోలిస్తే.. 2025-26లో మన బంగారం దిగుమతులు దాదాపు 24శాతం పెరిగాయి. భారతీయులు కొనే బంగారంలో 90 శాతానికి పైగా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నదే. అందుకు మనం భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేయాల్సి వస్తోంది. కాబట్టి మోదీ చెప్పినట్లు ఏడాది పాటు బంగారం కొనకుండా ఉంటే కచ్చితంగా మన విదేశీ మారక ద్రవ్య నిల్వలపై భారం కాస్తంతైనా తగ్గుతుంది. ఇందులో ఉన్నత వర్గాల వారి కొనుగోళ్లే ఎక్కువని గుర్తించాలి. ఉన్నత వర్గాల వారు సైతం బంగారం కొనుగోళ్లు చేపట్టకుండా చూడాలి. బంగారం దిగుముతలపై ఆంక్షలు విధించాలి. దీంతో దేశీయంగా ఇళ్లల్లో మూలుగుతున్న బంగారన్ని బయటకు తీసి ఆదాయ వనరుగా మార్చాలి. ఇవన్నీ చేయగలుగుతామని చెప్పాలి. ఇకపోతే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో బీజేపీ అధికార పగ్గాలు చేపట్టినప్పుడు, సామాన్యుడు తన కష్టాలన్నీ తీరిపోతాయని, భవిష్యత్తు బంగారం అవుతుందని కలలుగన్నాడు. కానీ కలలు కల్లలు అయ్యాయి. వస్తూత్పత్తి పెరిగింది. దాన్యం దిగుబడులు పెరిగాయి. కానీ ధరలు అమాంతంగా అంతకు రెట్టింపు అయ్యాయి. విద్యవైద్యం ఖరీదైన వస్తువుగా మారింది. అందుకే ప్రధాని మోడీ మాటలను సానుకూలంగా తీసుకుని నిజాన్ని మాట్లాడుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అచ్చే దిన్ అన్న మోడీ మంచి రోజులు నిజంగా సామాన్యుడి ముంగిట నిలిచాయా అన్నది కూడా చర్చించాలి. కానీ నినాదాల హోరులో నిజాలు సమాధి అయ్యాయి. ప్రభుత్వ ప్రకటనలు చూస్తుంటే భారతదేశం వెలిగిపోతున్నట్లు కనిపిస్తున్నది. కానీ సామాన్యుల బతుకులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ప్రపంచంలోనే 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, డిజిటల్ ఇండియా విప్లవం, మేక్ ఇన్ ఇండియా అంటూ భారీ నినాదలు బయలుదేరాయి. కానీ రాజకీయ నాయకులు బలపడుతున్నారు. ప్రజలు బలహీన పడుతున్నారు. రాజకీయ నాయకులకు ఊడిగం చేసే దౌర్భాగ్యం పెరుగుతోంది. ఒక దేశంగా మనం ఎంత గర్వంగా తలెత్తుకుంటున్నామో, అదే స్థాయిలో అప్పుల భారంతో తల దించుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది. అందుకే ఖర్చులు తగ్గించుకోవడం అవసరమే. అది రాజకీయ నాయకలు నుంచి మొదలు కావాలి. మోడీ ఒక నిర్ణయం తీసుకుని పార్లమెంటులో చట్టం చేయాలి. రాజకీయ నాయకుల జీతభత్యాలు, పెన్షన్లు ఎత్తేయాలి. విదేశీ టూర్లు, విమాన ఖర్చులపై ఆంక్షలు విధించాలి. ఉచిత పథకాలను ఎత్తేయాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది. మోడీ కోరుకున్న ఖర్చుల తగ్గింపు ఆలోచన కార్యరూపం దాలుస్తుంది.

## తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా జేసీడీ ప్రభాకర్

మొదటిపేజీ తరువాయి..

ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ప్రతిపాదించారు. ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా స్పీకర్ ఎన్నిక జరిగింది. అనంతరం



ప్రోటెం స్పీకర్‌గా తన పాత్ర ముగిసినట్టు కరుప్పయ్య ప్రకటించారు. ఆ వెంటనే సభాసాంప్రదాయం ప్రకారం స్పీకర్ ప్రభాకర్‌ను ఆయన చైర్ వరకూ సభానేత కేఏ సెంగోట్టియన్, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తోడ్కొని వెళ్లారు. ఆయనకు అభినందనలు తెలిపారు. స్పీకర్‌గా ప్రభాకర్ బాధ్యతలు చేపట్టిన వెంటనే డిప్యూటీ స్పీకర్ ఎన్నికను చేపట్టారు. డిప్యూటీ స్పీకర్ పదవికి తురైయూర్ టీవీకే ఎమ్మెల్యే ఎం.రవిశంకర్ ఒక్కరే నామినేషన్ వేశారని, దీంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైందని ప్రభాకర్ ప్రకటించారు. రవిశంకర్ నామినేషన్‌ను సెంగోట్టియన్ ప్రతిపాదించారు.

# నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనది

మొదటిపేజీ తరువాయి..

ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మీర్జా రహ్మత్ బేగ్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీపీహెచ్ రవింద్ర నాయక్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నర్సులను ఉద్దేశించి ప్రసంగించారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని నర్సులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించిన నర్సింగ్ ఆఫీసర్లకు, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం రోజునే నియామక పత్రాలు అందించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈరోజు మీకు జీవితాంతం గుర్తుండిపోతుంది.నర్సింగ్ అనేది కేవలం ఒక వృత్తి కాదు.. మానవత్వానికి చేసే గొప్ప అవకాశం. రోగులకు చికిత్స అందించడమే కాదు.. వారికి ధైర్యం, భరోసా, ఆశను కల్పించేది నర్సులే. ప్రపంచ నర్సింగ్ రంగానికి మార్గదర్శకురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలను ఈ సందర్భంగా మనం స్మరించుకోవాలి.పరిశుభ్రత, క్రమశిక్షణ, శాస్త్రీయ వైద్య సేవల ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయురాలు ఆమె.మీరు అందరూ ఆమెను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలి. కోవిడ్‌లో కుటుంబ సభ్యులు కూడా పేషెంట్ల దగ్గర ఉండలేని పరిస్థితి, అటువంటి భయంకర మైన పరిస్థితుల్లో కూడా నర్సులు సేవలు అందించారు. తెలంగాణ ప్రజలు ఆ సేవలను ఎప్పటికీ గుర్తుంచు కుంటారు. గతంలో ప్రభుత్వ హాస్పిటళ్లలో భారీగా ఖాళీలు ఉండటం వల్ల వైద్య సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి ఉండేది. ఈ సమస్యను మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని భారీ స్థాయిలో నియామకాలు చేపట్టింది. గత రెండున్నరేళ్లలో ఆరోగ్యశాఖలో దాదాపు 13 వేల పోస్టులను భర్తీ చేశాం. ఇదే గ్రౌండ్‌లో ఇప్పటికే 1,257 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు నియామక పత్రాలు అందజేశాం. ఇక్కడే 623 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్‌లకు నియామక పత్రాలు అందించాం. ఇక్కడే 132 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు నియామక పత్రాలు అందించాం. ఈరోజు ఇక్కడే 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందిస్తున్నాం అని మంత్రి వివరించారు. గతంలో 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేశాం. రెండున్నర సంవత్సరాల్లో 9 వేల నర్సింగ్ పోస్టులను భర్తీ చేసిన ఘనత మన ప్రభుత్వానికి దక్కుతుంది. దాదాపు మరో 5 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో సుమారు 2 వేల ఏఎన్ఎం పోస్టుల ఫలితాలు మరో ఒకటి, రెండు రోజుల్లో ప్రకటిస్తాం.న్యాయపరమైన కారణాలతో ఆలస్యమైన 732 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీని కూడా త్వరలో పూర్తి చేస్తాం అని మంత్రి దామోదర వెల్లడించారు.

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం



మొదటిపేజీ తరువాయి..

సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం



కలగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని.. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు గోడౌన్స్‌కు తరలించాలని అన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందే అని.. ప్రతి అధికారి జవాబుదారీ తనంతో వ్యవహరించాల్సిందే అని తేల్చిచెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. తరలించేలా ప్రణాళికలుండాలని తెలిపారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు పోర్ట్ పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమామీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని రేవంత్ తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని సూచించారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అకాల వర్షాల సమయంలో నష్టం జరగకుండా ఆదేశించారు. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. మిషన్ మోడ్‌లో పనిచేస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని తెలిపారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని.. ఏ సమస్య వచ్చినా కలెక్టర్లదే బాధ్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ



మొదటిపేజీ తరువాయి..

ఇళ్లను లబ్దిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌లో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదన్నారు. అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2 బిహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్దిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నా రు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిథిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను ఆదేశించారు. 2 బిహెచ్ కె ఇండ్లకు లబ్దిదా రులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి అయిన వాటికి, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటికి ఈ నెలాఖరు కల్లా లబ్దిదారులను గుర్తించాలని, అది కూడా ఆ కాలనీలకు అయిదు నుంచి ఎనిమిది కిలోమీటర్ల లోపు ఉన్న వారినే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మాణాలన్నీ పూర్తైన ఇండ్లలో లబ్దిదారులు ఉండేలా చూసేలా నిరంతరం పర్యవేక్షించా లన్నారు. ఈ కాలనీల్లో మంచినీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల కల్పనకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో ఇండ్ల స్థలాలు ఉండి అర్హులైన లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, పనితీరు మెరుగుపడాలని అన్నారు. పిడిలు తమ పరిధిలో గతంలో నిర్మించిన జెన్ఎన్ యుఆర్ఎం, రాజీవ్ గృహకల్ప, వాంబే హౌసింగ్ కాలనీలన్నిటిని సందర్శించాలని స్పష్టంగా నిర్దేశిరచారు. అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి పొంగులేటి హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో యుఎల్ సి భూములు కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా కొంత భాగాన్ని రిజిస్ట్రేషన్ చేశారని , స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకుని రాగా వెంటనే సంబంధిత సబ్ రిజిస్ట్రార్?పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ఉదయనిధి మరోమారు అనుచిత వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి..

ధర్మంపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియాతో పోల్చుతూ దానిని నిర్మూలించాలని వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. పలువురు కోర్టులలో పిటిషన్లు కూడా వేశారు. తాజాగా, మంగళవారం మధ్యాహ్నం తమిళనాడు అసెంబ్లీలో కూడా ఉదయనిధి అదే తరహా వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని అసెంబ్లీ వేదికగా ప్రసంగించారు. అసెంబ్లీ కొత్త స్పీకర్‌గా ఎన్నికైన జె.సి.డి. ప్రభాకర్‌ను అభినందిస్తూ చేసిన ప్రసంగంలో ఉదయనిధి స్టాలిన్ ఈ వ్యాఖ్య చేశారు. ఉదయనిధి వ్యాఖ్యలపై తమిళనాడు బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసన్ ఘాటుగా స్పందించారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనా ఆయన మారలేదని విమర్శించారు. డీఎంకే నిజంగా ఇదే సిద్ధాంతాన్ని నమ్మితే ఎన్నికల మేనిఫెస్టోలో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు హిందూ మతాన్ని నిర్మూలించడమే ఉదయనిధి స్టాలిన్, డీఎంకేల విధానమైతే, దానిని వారి ఎన్నికల మేనిఫెస్టోలో ఎందుకు ప్రస్తావించలేదని మండిపడ్డారు. ఎన్నికల ప్రచార సమయంలో ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మం నిర్మూలన గురించి ఎందుకు మాట్లాడలేదు. ఎన్నికల ప్రచారం చివరి రోజున 'మేం హిందువులకు వ్యతిరేకం కాదు' అని స్టాలిన్ ఎందుకు చెప్పుకున్నారు' అని శ్రీనివాసన్ ప్రశ్నించారు.

## కవితకు రైల్వే కోర్టు సమన్లు

మొదటిపేజీ తరువాయి..

కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కొంతకాలం క్రితం కామారెడ్డి జిల్లా కేంద్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కవిత ఆధ్వర్యంలో రైల్ రోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే రవాణాకు అంతరాయం కలిగిందని రైల్వే ఏఎస్ఐ రవీంద్రబాబు ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. రైల్ రోకోతో నిజామాబాద్-హైదరాబాద్ రూట్‌లో అంతరాయం ఏర్పడింది. నేటి ఉదయం 10:30కి విచారణకు హాజరు కావాలని సికింద్రాబాద్ రైల్వే కోర్టు ఆదేశించింది. దేవగిరి ఎక్స్‌ప్రెస్‌తో పాటు గూడ్స్ రైలు నిలిపివేతపై రైల్వే యాక్ట్ సెక్షన్ల కింద కవితపై న్యాయస్థానం కేసు నమోదు చేసింది. ఈ కేసులో కవితతో పాటు మరో 12 మంది బీఆర్ఎస్ నాయకులపై కూడా కేసులు నమోదయ్యాయి. రైల్వేచట్టాల ఉల్లంఘన, ప్రజా రవాణాకు ఆటంకం కలిగించడం వంటి ఆరోపణలపై కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా నేడు సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు కవిత, బీఆర్ఎస్ నేతలు హాజరవుతారా లేదా అనేది ఉత్కంఠగా మారింది. బీసీ రిజర్వేషన్ల అంశం తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారిన నేపథ్యంలో ఈ కేసు ప్రాధాన్యం సంతరించుకుంది.



IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE AT : PARIGI VIKARABAD DISTRICT

**O.S. No. 07 OF 2025**

**Between:**

Pentala @ Harijan Ramchandraiah And Others **...Plaintiffs**

**AND**

The Tahsildar/M.R.O., Chowdapur Mandal, Vikarabad District. **...Defendant.No.1**

**AND**

All Concerned. **.... Defendant.No.2**

**PUBLIC NOTICE**

Take notice that the above named Plaintiffs have filed the above suit seeking Declaration of Legal heir in respect of deceased Late Sri Pentala @ Harijan Ramaiah, who died intestate on 16/12/2007.

The Plaintiffs claim themselves to be the legal heirs and successors of the deceased and have approached this Hon'ble Court for appropriate declaration.

If any person or persons are having any objection, claim, right, title or interest regarding the legal heirs of the deceased, they may appear before the above Hon'ble Court on 25/06/2026 at 10.30 am either personally or through an Advocate , failing which the matter will be heard and decided in their absence according to law.

**SCHEDULE OF PROPERTY**

All that the property admeasuring Ac.4-00 Guntas in Sy.No.187/21, situated at Kothapally Village, Chowdapur Mandal, Vikarabad District, and bounded by:

EAST : Jamuula Chandraiah, WEST : Forest Land, SOUTH : Forest Land, NORTH : Jamuula Chandraiah

// BY ORDER OF THE HON'BLE COURT //

Place: Parigi

Date: 11/06/2026

**Counsel for Plaintiffs**

**SHAHNAAZ**

**SYED KHALEEL**

**RAHATH HUSSAIN, ADVOCATES**

# ఎస్సి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ

**– ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్**





**మే 11, సిర్పూర్ టి నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి :** కొమురం భీం ఆసిఫాబాద్ సిర్పూర్(టి)మండల కేం ద్రంలోని పారిగాం గ్రామం లో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాఎమ్మెల్సీ దండే విట్టల్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండేవిటల్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఈ కమ్యూనిటీ హాల్ శుభకార్యాలలు సమావేశాలు నిర్వహించు కోవడానికి అన్ని సౌకర్యా కల్పిస్తామన్నారు గ్రామం లో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్సీ దండే విఠల్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగ స్పందించి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్ర మంలో స్థానిక సర్పంచ్ రాజక్క, ఉపసర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ మండల అధ్యక్షులు అఖిల్ అమ్మద్,మాజీ జెడ్పీటీసీ సభ్యులు ధోని రవీందర్,మాజీ ఎంపీటీసీలు సోహెల్ అమ్మద్,ఎలుములే కిషోర్,నాయకులు అమీర్,కొండయ్యా,తదితరులు పాల్గొన్నారు

# బండి సంజయ్‌ను పదవి నుంచి తొలగించాలి

**– మైనర్ బాలికకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్**



**ఆసిఫాబాద్ మే 12 ప్రజాజ్యోతి :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరత్ వ్యవహారంపై కాంగ్రెస్ ప్రభుత్వ మౌనం నిందితులకు రక్షణగా మారిందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆరోపించారు. సోమవారం ఆసిఫాబాద్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. మైనర్ బాలికపై లైంగిక వేధింపులు జరిగినా కాంగ్రెస్ సర్కార్ స్పందించకపోవడం దారుణమన్నారు. వీడియో ఆధారాలున్నా నిందితుడిని అరెస్ట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. బండి సంజయ్ నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని, కేంద్రం ఆయన్ను పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మొదట ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా బాధితురాలిని బెదిరించడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని ఆరోపించారు. మహిళా రక్షణ గురించి మాట్లాడే కాంగ్రెస్ నేతలు ఈ ఘటనపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బాలికకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు.

# రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



**రామకృష్ణాపూర్, మే 12(ప్రజాజ్యోతి):** సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని, వివాదాలు, బెదిరింపులకు దూరంగా ఉండాలని రామకృష్ణాపూర్ ఎస్సై జె.శ్రీధర్ సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు మంగళవారం స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని తెలిపారు. సత్ప్రవర్తన కలిగిన వారిపై రౌడీషీట్ తొలగిస్తామని పేర్కొన్నారు.

# జిల్లాలో డీజేలు పూర్తిగా నిషేధం

**– నిబంధనలు ఉల్లంఘించే డీజే యజమానులపై కఠిన చర్యలు**
**– రాత్రి 10 గంటల తర్వాత శబ్ద కాలుష్యం కలిగించే సౌండ్ సిస్టమ్‌లపై చర్యలు**
**– జిల్లా ఎస్పీ శ్రీమతి నితిక పంత్ ఐపీఎస్**



**ఆసిఫాబాద్ మే 12 ప్రజా జ్యోతి :** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో డీజే సిస్టమ్‌ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు జిల్లా ఎస్పీ శ్రీమతి నితిక పంత్ ఐపీఎస్ తెలిపారు. వివాహాలు, శుభకార్యాలు, ఊరేగింపులు మరియు ఇతర కార్యక్రమాల సందర్భంగా మైక్ బాక్సులు, సౌండ్ సిస్టమ్‌లు వినియోగించాలనుకునే వారు తప్పనిసరిగా సంబంధిత ఎస్‌డిపిఓ కార్యాలయం నుండి ముందస్తు అనుమతి పొందాలని సూచించారు. అదేవిధంగా రాత్రి 10 గంటల తర్వాత శబ్ద కాలుష్యానికి కారణమయ్యే మైక్ బాక్సులు, లౌడ్ స్పీకర్లు, భారీ సౌండ్ సిస్టమ్‌ల వినియోగానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు మరియు శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనల ప్రకారం ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్‌ల వినియోగం నిషేధించబడిందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత పరికరాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ అధికారులకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిబంధనలు ఉల్లంఘించే వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని, ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా డీజేలు లేదా అధిక శబ్దంతో మైక్ బాక్సులు వినియోగిస్తున్నట్లు గమనిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ కోరారు.

# కలియుగ ఆరాధ్య దైవం హనుమంతుడు

- అంగరంగ వైభవంగా పెద్ద హనుమాన్ జయంతి
- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటల్






**ఖానాపూర్ మే 12 (ప్రజా జ్యోతి) :** గ్రామ గ్రామాన వెలిసి ఉండే కలియుగ ఆరాధ్య దైవం హనుమంతుడేనని వేద పండితులు నిమ్మగడ్డ సందీప్ శర్మ అన్నారు పరభవనామ సంవత్సర వైశాఖ బహుళ దశమి పూర్వాభద్ర నక్షత్రం సందర్భంగా హనుమాన్ పెద్ద జయంతి మహోత్సవాన్ని పంచముఖి క్షేత్రంలో మంగళవారం అంగరంగ వైభవంగా జరిపించారు ఆలయ అర్చకులు తిరునగరి నందకిషోర్ ఆచార్య జయంతి సందర్భంగా ఉదయం 5:30 గంటల నుంచి ప్రత్యేక పూజలలో భాగంగా గణపతి పూజ పుణ్యా వచనం పంచ గవ్య ప్రాసనం రక్షాబంధనం పంచామృత నవరసాభిషేకాలు స్వామి వారికి నిర్వహించి అలంకరణ అర్చన హనుమాన్ సహస్రనామ, ఆకు పూజ నైవేద్యం సమర్పించారు అనంతరం యజ్ఞాచార్యులు నిమ్మగడ్డ సందీప్ శర్మ ఆధ్వర్యంలో, అర్చకులు ప్రవీణ్ శర్మ లు 10 గంటలకు సుదర్శన కలశ స్థాపన నవగ్రహ మంటప స్థాపన ఆరాధనలు స్థాపిత దేవత హోమాలు సుదర్శన మన్య,సూక్త ఆంజనేయ స్వామి మూల మంత్ర హోమాలు జయాధి ప్రజాచిత హోమాలు క్షేత్రపాలక బలులు పూర్ణాహుతి నిర్వహించి మధ్యాహ్న 12 గంటలకు హారతి మంత్రపుష్పం తీర్థప్రసాదాలు వితరణ చేశారు అనంతరం మహా అన్నదానం కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు హోమంలో సుమారు 15 మంది పుణ్య దంపతులు పాల్గొనగా ఇందులో స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ అజయ్ కుమార్ దంపతులు లావణ్య అజయ్ ఆలయ కమిటీ అధ్యక్షులు అల్లాడి రమ వెంకటేశ్వర్లు హిందూ ఉత్సవ కమిటీ మాజీ అధ్యక్షులు రాచమల్ల సంగీత రాజశేఖర్ మంత్రరాజం రమ శ్యామకృష్ణ, సురేష్ కవిత,కృష్ణవేణి శ్రీనివాస్ ఆచార్య శిరీష డాక్టర్ రాము తోట హనుమంతు, ఎడ్ల రాజేశ్వర్ భవాని రాజేశ్వర్, కౌన్సిలర్లు బొప్పరపు సత్యవతి రాజేశ్వర్ తోడసం ఇందిరాతో పాటు పలువురు దంపతులు హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్లు నిర్వహించారు. **ఆలయ అభివృద్ధికి సహకరిస్తాం ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ హామి :** పట్టణ ప్రాంతాన్ని ఆనుకొని అటవీ ప్రాంతంలో ప్రశాంతమైన వాతావరణంలో ప్రతిష్టించిన సంకట యోజన పంచముఖ హనుమాన్ ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందజేస్తామని ఖానాపూర్ శాసనసభ్యులువెద్మ బొజ్జు పటేల్ హామీ ఇచ్చారు మంగళవారం హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితులు సందీప్ శర్మ అర్చకులు నందకిషోర్లచే ఆశీర్వాదాలు తీర్థప్రసాదాలు గావించి ఆలయ కమిటీ తరపున ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ దేవాదాయ శాఖ తరపున శాశ్వత ప్రతిపాదికన ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని మొదట ఆలయ కమిటీని ఏర్పాటు చేసుకొని ఆలయానికి సంబంధించిన పనులు నివేదించాలని ఎమ్మెల్యే కోరారు ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ ఇంచార్జ్ అంకం మహేందర్ బిజెపి రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ మాజీ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ కౌన్సిలర్ నిమ్మల రమేష్ గుమ్మల ఆనంద్ అశోక్ నేరెళ్ల సత్యనారాయణ కులాలు నాయక్ మాజీ మార్కెట్ చైర్మన్ సాకారం శ్రీనివాస్ శ్రీపాద శేషాద్రి బాల సంకుల రాజేందర్ఆలయ కమిటీ సభ్యులు తుమ్మనపల్లి లక్ష్మణ్ సింగ్ ప్రవీణ్. లక్ష్మీనారాయణ హనుమంతు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేయాలి

- బండి భగీరథ్ పైన కటిన చర్యలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారిణి నియమించింది
- ప్రజా ప్రభుత్వంలో ధనిక, బీద తేడాలండువు అందరికీ ఒకటే చట్టం, న్యాయం
- ప్రెస్ మీట్‌లో నిర్మల్ డిసిసి అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్



**ఖానాపూర్ మే 12 (ప్రజా జ్యోతి) :** ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలలో ప్రెస్ మీట్ నిర్వహించిన నిర్మల్ డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర సహాయ హోమ్ శాఖ మంత్రి బండి సంజయ్ సమాజం పట్ల,మహిళల పట్ల గౌరవం ఉంటే ఆయన కొడుకు బండి భగీరథ్ చేసిన నీచమైన పనికి బాధ్యత వహిస్తూ వారి పదవికి రాజీనామా చేయాలన్నారు.బండి సంజయ్ నిజమైన శ్రీ రాముడి భక్తుడైతే , హిందూ ధర్మం పైన ఆయనకి గౌరవం ఉంటే హానీ ట్రాప్ పేరుతో అమ్మాయిలను మోసం చేస్తూ, నీచపు పనులు చేస్తున్న ఆయన కొడుకుని సరెండర్ చేయించి చట్టానికి అప్పగించాలని డిమాండ్ చేసారు .ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ,దనిక అనే తేడాలు ఉండవని ప్రతి ఒక్కరికి ఒకే చట్టం వర్తిస్తుందని ముఖ్యమంత్రి అనేక సందర్భాల్లో హెచ్చరించారని గుర్తు చేశారు రాష్ట్రానికి దేశ ప్రధాని రావడం వల్ల అభివృద్ధి కార్యక్రమాల దృశ్య . ఈ సమస్య పైన కొంత ఆలస్యం అయినప్పటికీ వెంటనే ఇలాంటి సంఘటనలు జరగకుండా కటిన చర్యలు తీసుకోవడానికి ఒక ఐపీఎస్ ప్రత్యేక అధికారిణి నియమించి , కేసు విచారణ జరిపిస్తున్నారని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ వివరించారు బండి సంజయ్ కొడుకు పైన అధికారులు కేసు బుక్ చేసి ఎఫైఐర్ నమోదు చేశారన్నారు ప్రతిపక్షాలు అనవసరంగా ప్రభుత్వం పైన బురద చల్లే ప్రయత్నం చేస్తే అది వారికే నష్టం,బిజెపి పార్టీకి చిత్త శుద్ధి ఉంటే బండి సంజయ్ ని మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేసి , పార్టీ నుండి సస్పెండ్ చేయాలన్నారు. మహిళలు ఆడపిల్లాల రక్షణ కొరకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక టిమ్ ను ఏర్పాటు చేసి ప్రతి క్షణం అగాయత్యలు జరగకుండా డేగ కన్నుల ఈగల్ టీమ్ (ప్రత్యేక బృందం) రాష్ట్రంలో అణువణువు పర్యవేక్షిస్తుంది అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో డ్రగ్స్ ,ఇతర దుర వ్యసనాల నుండి యువతను , విద్యార్థులను కాపాడేందుకు ప్రభుత్వ వ్యవస్త రక్షణ కవచంలా పని చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాజీద్ కౌన్సిలర్ నిమ్మల శ్రీనివాస్ మాజీ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ నాయకులు జంగిలి శంకర్ గౌర్రె గంగాధర్ నేరెళ్ల సత్యనారాయణ మైనారిటీ పట్టణ అధ్యక్షులు షౌకత్ పాషా సర్పంచ్ల ఫోరం మండల కార్యదర్శి సచిన్ కుమార్ మధిర సత్యనారాయణ నేత శ్యాంసుందర్ రాస మల్ల అశోక్ శ్రీపాద శేషాద్రి ఇతర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలుగకూడదు




**– రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 12, (ప్రజాజ్యోతి) :** మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం, సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్రంలో వరి, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై పలువురు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, తదితర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాదు నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, మొక్కజొన్న, వరి పంటల కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. హమాలీలు, గన్ని సంచులు, ధాన్యం తరలింపునకు లారీలు, ధాన్యం నిల్వ చేయడానికి తగిన స్థలాల కొరత లేకుండా చూడాలన్నారు. ధాన్యం సరఫరాకు అవసరమైతే లారీలతో పాటుగా ట్రాక్టర్లను కూడా వినియోగించుకోవాలన్నారు. ధాన్యం తరలింపుకు సంబంధించి లారీల కాంట్రాక్టర్లు అలసత్వం వహిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ ప్రక్రియకు అవసరమైతే స్థానిక హమాలీలను నియమించుకోవాలని పేర్కొన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన వెంటనే వారికి రశీదులు ఇవ్వాలన్నారు. అకాల వర్షాల వల్ల రైతులు తమ పంటలు నష్టపోకుండా చూడాలన్నారు. వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్లందరూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలిగితే ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో పాల్గొన్నారు.వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొక్కజొన్న, వరి పంటల కొనుగోలు సాఫీగా పూర్తి చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి అన్లోడింగ్ పాయింట్ లు దగ్గర్లో ఉంటే ట్రాక్టర్ల ద్వారా ధాన్యం సంచులు తరలించే విధంగా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సంచులు నిల్వ ఉంచరాదని పేర్కొన్నారు. ధాన్యం తూకం, తరలింపులో ఎట్టి పరిస్థితుల్లో రైతుల నుంచి డబ్బులు వసూలు చేయరాదని హెచ్చరించారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, పౌర సరఫరాల అధికారి, మేనేజర్ లు రాజేందర్, సుధాకర్, డిఎం మార్క్ ఫెడ్ మహేష్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డిఆర్డీఓ విజయలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా





**నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 12, (ప్రజాజ్యోతి) :** వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయని జిల్లా కలెక్టర్ కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం, పట్టణంలోని జుమ్మెరాత్ పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్, పిల్లలతో ముచ్చటించి వారి వివరాలు, జీవిత లక్ష్యాలు ఏంటో అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు సమ్మర్ క్యాంప్ కి రావాలని చెప్పారు. సమ్మర్ క్యాంపులో ఆటలు, పాటలు, యోగ, డ్యాన్స్, ఇతర అంశాల్లో శిక్షణ ఇస్తారని వివరించారు. పిల్లలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. వేసవి శిబిరాలతో పిల్లల నైపుణ్యాల పెరుగుదలతో పాటు, వారిలో దాగి ఉన్న ప్రతిభ బయట పడుతుందన్నారు. ఉపాధ్యాయులు, శిక్షకులు, వేసవి శిబిరాలకు వచ్చే విద్యార్థులకు అన్ని విషయాలు చక్కగా నేర్పించాలని వివరించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పదవ తరగతి పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ, అందరూ ఖచ్చితంగా ఉత్తీర్ణత సాధిస్తారని, అధైర్య పడవద్దని ప్రోత్సహించారు. ఆయా సబ్జెక్టులు శ్రద్ధగా చదువుకొని ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎటువంటి సందేహాలు ఉన్న ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని అన్నారు. వారి భయాలు, సందేహాలు తొలగించి, వారిని ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సొనాల 'సెంట్రల్ లైటింగ్‌కు రూ. 70 లక్షల నిధులు



**సొనాల, మే 12 (ప్రజాజ్యోతి) :** సొనాల గ్రామ ప్రజల చిరకాల కాంక్ష నెరవేరింది. గ్రామంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ. 70 లక్షల నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో తాము ఇచ్చిన హామీ మేరకు నిధులు కేటాయించడంపై మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. సొనాల గ్రామం గుండా అంతరాష్ట్ర రహదారి వెళ్తున్న నేపథ్యంలో, ప్రయాణికులు, స్థానిక ప్రజల భద్రత కోసం సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి, తక్షణమే రూ. 70 లక్షల నిధులను విడుదల చేశారు. ఈ నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను మంగళవారం హైదరాబాద్‌లో ఈఎన్సీ (జుచీజ) మోహన్ నాయక్ నుంచి అందుకున్నట్లు తుల శ్రీనివాస్ తెలిపారు. నిధులు కేటాయించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు నిధుల మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో గ్రామం రూపురేఖలు మారడమే కాకుండా, రాత్రి వేళల్లో రహదారిపై ప్రమాదాల భయం తప్పుతుందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# పాత్రికేయులు గాండ్ల రాజశేఖర్‌ని పరామర్శించిన ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్



**ఖానాపూర్ మే 12 (ప్రజా జ్యోతి) :** ఖానాపూర్ సీనియర్ పాత్రికేయులు గాండ్ల రాజశేఖర్ తల్లి అనారోగ్యం పరిస్థితిని తెలుసుకొని స్థానిక శాసనసభ్యులు నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెద్మ బొజ్జు పటేల్ మంగళవారం మండలంలోని తర్లపాడ్ గ్రామానికి వెళ్లి శేఖర్ తల్లిలక్ష్మిని పరామర్శించారు బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆసుపత్రి లో చికిత్స తీసుకున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని,ధైర్యంగా ఉండాలన్నారు,ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ అబ్దుల్ మాజీద్, తర్లపాడ్ సర్పంచ్ సచిన్, ఖానాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు నిమ్మల్ రమేష్, గౌర్రె గంగాధర్, శంకర్, లౌడియ లాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నర్సుల సేవలు అమూల్యం

**– ఈడి చిరంజీవి**
**– ఎస్టిపిపిలో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం**



**జైపూర్ మే 12 ప్రజాజ్యోతి :** జైపూర్ మండలంలోని ఎస్టిపిపి డిస్పెన్సరీలో మంగళవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్టిపిపి ఈడి సిహెచ్ చిరంజీవి పాల్గొని నర్సుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆధునిక నర్సింగ్ వ్యవస్థకు ఆద్యురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య రంగంలో ప్రాణాలను కాపాడే దేవదూతలు నర్సులేనని పేర్కొన్నారు. రోగులకు మందులు అందించడమే కాకుండా ప్రేమ ఓర్పు సేవాభావంతో ధైర్యం చెప్పేది నర్సులేనని అన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కుటుంబాలకు దూరంగా ఉండి ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన నర్సుల త్యాగం మరువలేనిదని కొనియాడారు. ఆరోగ్య వ్యవస్థను సమర్థవంతంగా నడిపించడంలో నర్సులు వైద్యులకు కుడిభుజంలా పనిచేస్తున్నారని తెలిపారు. అనంతరం అధికారులు ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాండిల్స్ వెలిగించి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. నర్సింగ్ రంగంలో విశిష్ట సేవలందించిన సీనియర్ స్టాఫ్ నర్సు రాజమణిని ఉత్తమ స్టాఫ్ నర్సుగా ఎంపిక చేసి ఈడి చిరంజీవి ప్రశంసాపత్రం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టిపిపి జీఎం ఎం.నరసింహరావు, జీఎం(పీసీఎస్ – ఓఅండ్ఎం) ఎం.మదన్మోహన్, ఏజీఎం(పీసీఎస్) కే.సూర్యనారాయణ రాజు, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి సత్యనారాయణ, సీఎంఓఏఐ బ్రాంచ్ అధ్యక్షుడు డి. పంతులు,మెడికల్ సూపరింటెండెంట్ బి.జానకి, ఎస్వో టు ఈడి వెంకటయ్య, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహన్ సింగ్,రిటైర్డ్ డాక్టర్ ప్రభాకర్ తదితర అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలి
- సైబర్ క్రైమ్, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

వనపర్తి ప్రతినిధి, మే 12 (ప్రజాజ్యోతి): మహిళలు దేశ నిర్మాణంలో సమాన భాగస్వాములుగా ఎదగాలంటే సామాజిక, ఆర్థిక బలోపేతం అవసరమని మహిళా సాధికార కేంద్రం సిబ్బంది సుమ పేర్కొన్నారు. వనపర్తి మండలంలోని కిష్టగిరి గ్రామంలో



మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన ద్వారా వారిని స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మహిళలు దేశ నిర్మాణంలో సమాన భాగస్వాములుగా ఎదగాలంటే సామాజిక, ఆర్థిక బలోపేతం అవసరమని పేర్కొన్నారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు ఆర్థిక మోసాల నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని పూర్తి ఆర్థిక అక్షరాస్యత సాధించాలని కోరారు. అలాగే సైబర్ క్రైమ్, బాలల చట్టాలు, చైల్డ్ లేబర్, బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలల సహాయానికి 1098, సైబర్ క్రైమ్ ఫిర్యాదులకు 1930, మహిళల గృహహింస సహాయానికి 181, పోలీస్ సహాయానికి 100, వయోవృద్ధుల సహాయానికి 14567 టోల్ ఫ్రీ నంబర్ల ఉపయోగాలను మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికార కేంద్రం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జిల్లా కార్యాలయ నిర్మాణానికి కీలక అడుగు

- రాజపేటలో కాంగ్రెస్ కార్యాలయ స్థల పరిశీలన: డీసీసీ చీఫ్ శివసేన రెడ్డి

వనపర్తి, మే 12 (ప్రజాజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీకి శాశ్వత కార్యాలయ నిర్మాణం దిశగా కీలక చర్యలు ప్రారంభమైనట్లు డీసీసీ చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి తెలిపారు. పార్టీ బలోపేతంతో పాటు కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రశాంత వాతావరణంలో ఆధునిక సౌకర్యాలతో జిల్లా కార్యాలయాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు.



మంగళవారం జిల్లా కార్యవర్గ సభ్యులతో కలిసి రాజపేట శివారులోని 73 సర్వే నెంబర్లో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించి హద్దులను గుర్తించారు. సుమారు ఎకర విస్తీర్ణంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ, స్థల పరిశీలన అనంతరం త్వరలోనే శంకుస్థాపన చేసి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని నిర్మాణ కమిటీ సభ్యులకు సూచించారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఆహ్లాదకర వాతావరణంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యమన్నారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ నేతృత్వంలో త్వరలో కార్యాలయ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సాయి చరణ్ రెడ్డి, అధికార ప్రతినిధులు కోళ్ల వెంకటేష్, గంధం శరవంద్, పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వ సర్వేయర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తున్నారు

- పదో తరగతి ప్రతిభావంతులను సన్మానించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్, మే 12 ( ప్రజా జ్యోతి బ్యూరో ) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో హన్వాడ మండలం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భంగా వారిని మహబూబ్‌నగర్ నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సి. చరణ్ కుమార్ 473 మార్కులు, డి. విజయలక్ష్మి 468 మార్కులు, డి. రాకేష్ 452 మార్కులు,



ఎన్. అక్షయ 443 మార్కులు, పి. కార్తిక్ 431 మార్కులు సాధించి ప్రశంసలు అందుకున్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. రాబోయే పదేళ్లలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే విద్యా రంగంలో అగ్రస్థానంలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో విద్యా వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని, తెలంగాణ ఏర్పడ్డ తర్వాత ప్రారంభం నుంచే సరైన దృష్టి పెట్టి ఉంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందేదని అన్నారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని పేర్కొన్నారు. కార్పొరేట్ స్థాయిని తలదన్నే విధంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు వెనుకబడిన, పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, ఉపాధ్యాయులు సాయినాథ్, శ్రీనాథ్, వెంకటేష్, షాబుద్దీన్, కె. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించాలి:అదనపు కలెక్టర్ మధుమోహన్

గద్వాల మే 12(ప్రజా జ్యోతి ప్రతినిధి): వరి ధాన్యం,మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా సజావుగా కొనుగోలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ (రెవిన్యూ) సంబంధిత సంబంధిత జిల్లా కలెక్టర్లు,ఆయా శాఖల అధికారులు బాధ్యత వహించాలన్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచి ఉండే పరిస్థితి లేకుండా త్వరితగతిన ధాన్యమును కొనుగోలు చేయాలన్నారు.తమకు కేటాయించిన భద్రపరచాలన్నారు.అవసరమైతే రైతు వేదికలు, ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్ లను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. సంబంధిత జిల్లా








జిల్లా అధికారులను ఆదేశించారు.మొక్కజొన్న,వరి ధాన్యం కొనుగోలు విషయంపై మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలువురు మంత్రులతో,సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాదు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ,ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని సంచుల కొరత లేకుండా,రవాణా,హమాలీల,తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు.కొనుగోళ్ల విషయంలో ఎలాంటి సమస్య వచ్చిన పరిష్కరించేందుకు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించకుండా ఇబ్బంది పెట్టే మిల్లర్స్,కాంట్రాక్టర్లపై తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హెచ్చరించారు.ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న అదనపు కలెక్టర్ వీసీ అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడారు.రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యంను మిల్లులకు తరలించేందుకు లారీల కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.ప్రభుత్వ గోదాములు సరిపోకుంటే ప్రైవేట్ గోదాములను కూడా అద్దెకు తీసుకొని ధాన్యాన్ని అధికారులు ధాన్యం కొనుగోలు విషయంలో బాధ్యత వహించాలని, నిబద్ధతతో పనిచేసి రైతులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం అవ్వకుండా చూడాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్,మేనేజర్ విమల,డిఏఓ వీరప్ప,సక్రియ నాయక్,మార్క్ఫెడ్ డీఎం చంద్రమౌళి,డిఆర్డిఓ ముషాహిదా బేగం,మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ,ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు

- కొనుగోలు కేంద్రాల్లో వెంటనే రశీదులు ఇవ్వాలి : సీఎం రేవంత్ రెడ్డి

మహబూబ్‌నగర్, మే 12 ( ప్రజా జ్యోతి బ్యూరో ) : మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లోనే వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని, ఎక్కడా హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హమాలీలు అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తే వారి లైసెన్సులను రద్దు చేయాలని హెచ్చరించారు. రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ రాబోయే ఒక నెల అత్యంత కీలకమని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ వరి ధాన్యం, మొక్కజొన్న





నాణ్యత పరిశీలన పూర్తి చేసి రైతులకు వెంటనే రశీదులు అందించాలని సూచించారు. మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తం కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి, దనసరి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కార్యాలయం వి.సి. హాల్ నుంచి ఖుష్బూ గుప్త, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ జిల్లాల్లో ఉన్న ప్రతి ప్రైవేట్ గోదామును అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని నిల్వ సదుపాయాలను పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు, రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలని ఆదేశించారు. పంట రవాణా కోసం ఖాళీగా ఉన్న ట్రాక్టర్లు, డీసీఎంలు సహా అన్ని వాహనాలను పూర్తి స్థాయిలో వినియోగించాలని తెలిపారు. స్థానిక హమాలీలను వంద శాతం టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని, తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించాలని తెలిపారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపుల కోసం ఇప్పటికే రూ.3,873 కోట్లను విడుదల చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 కోట్ల 68 లక్షల గన్నీ సంచులు అందుబాటులో ఉన్నాయని, ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారీగా మొక్కజొన్న దిగుబడి వచ్చిన నేపథ్యంలో రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం, మొక్కజొన్న తెలంగాణలోకి రాకుండా కొనుగోళ్లు రైతులకు ఇబ్బంది లేకుండా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గాల వారీగా సీనియర్ అధికారులను, రెండు మూడు కొనుగోలు కేంద్రాలకు ప్రత్యేక అధికారులను నియమించి మానిటరింగ్ చేపట్టనున్నట్లు వెల్లడించారు. వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు సిద్ధంగా ఉంచాలని, రవాణా, హమాలీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మీడియా ద్వారా వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో నర్సింహులు, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల సంస్థ డీఎం రవి నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.వెంకటేష్, జిల్లా సహకార అధికారి కృష్ణ, జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి, జిల్లా సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్, జిల్లా రవాణా అధికారి రఘు తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు

- మిషన్ భగీరథ అధికారులకు మంత్రి జూపల్లి ఆదేశం
- రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని సూచన

వనపర్తి ప్రతినిధి, మే 12 (ప్రజాజ్యోతి): కొల్లాపూర్ నియోజకవర్గంలోని చిన్నంబావి, వీపనగండ్ల, పానగల్ మండలాలతో పాటు ఎదుల మండలంలోని ఐదు గ్రామ పంచాయతీల్లో వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఐడీఓసీలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల వారీగా తాగునీటి సమస్యలను సర్పంచులు మంత్రి దృష్టికి తీసుకురాగా, అధికారులు కారణాలు వివరించారు. 2040 జనాభా అంచనాలతో రూపొందించిన మిషన్ భగీరథ ద్వారా ఇప్పటికీ పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరగకపోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో






పర్యటించి శాశ్వత పరిష్కారాలు కనుగొనాలని సూచించారు. అనంతరం రోడ్లు-భవనాల శాఖ పనుల పురోగతిని సమీక్షించిన మంత్రి, వనపర్తి–కొల్లాపూర్ వెంగళాయపల్లి రోడ్డు విస్తరణ, కేతేపల్లి సీసీ రోడ్డు పనులు నిలిచిపోవడంపై ఆరా తీశారు. బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పనులు ఆగిపోయాయని అధికారులు తెలిపారు. దీంతో ఆగిపోయిన పనుల వివరాలను ప్రభుత్వానికి వెంటనే పంపాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ సుబ్రమణ్యం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, ఆర్అండ్‌బీ ఈఈ దేశ్యానాయక్, మిషన్ భగీరథ ఎస్ఈ, ఈఈ అంజద్ పాషా, ఎస్‌డీసీ తిరుపతయ్య, డీఈలు, ఏఈలు, ఇతర అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

## నిర్వాసితుల పునరావాసంపై కలెక్టర్ ఆదేశాలు

మహబూబ్‌నగర్, మే 12 ( ప్రజా జ్యోతి బ్యూరో ) ఉదండాపూర్ రిజర్వాయర్ భూ నిర్వాసితుల పునరావాసం (ఆర్అండ్ఆర్) పనులను త్వరితగతిన పూర్తి చేసి నిర్వాసిత కుటుంబాలను వీలైనంత త్వరగా పునరావాస కాలనీలోకి తరలించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉదండాపూర్, వల్లూరు గ్రామాలతో పాటు చిన్నగుట్ట తండా, రేగడిపట్టె, తుమ్మలకుంట తండా, శామగడ్డ తండా, పోలేపల్లి హామ్లెట్ల నిర్వాసితులకు సంబంధించిన పునరావాస పనుల పురోగతిని సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పునరావాస కాలనీలో పెండింగ్‌లో ఉన్న ఆలయ నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాలు, అంతర్గత రహదారులు, విద్యుత్ సదుపాయాలు తదితర మౌలిక వసతుల పనులను తక్షణమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దేవాలయ నిర్మాణ పనులకు దేవాదాయ శాఖ నుంచి అవసరమైన అనుమతులు తీసుకుని వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. నిర్వాసితులు తమకు కేటాయించిన ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, అధికారులు తరచూ గ్రామాలను సందర్శించి సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇండ్ల నిర్మాణ అనుమతులు, బ్యాంకు రుణ సౌకర్యాలను సింగిల్ విండో విధానంలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల మిగిలిన వ్యవసాయ భూములకు వెళ్లేందుకు బండ్లబాటలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరగా, దీనిపై పరిశీలించి నివేదిక సమర్పించాలని జడ్చర్ల తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వచ్చే పది రోజుల్లో క్లియర్ చేయాలని, పనులు పూర్తయిన వెంటనే నివేదికలు సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జడ్చర్ల, బాలానగర్ మండలాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలు, తహసీల్దార్లకు సూచించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలపై కూడా సమీక్ష నిర్వహించిన కలెక్టర్, మిషన్ భగీరథ పైప్‌లైన్‌లలో లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఇంజినీర్లను ఆదేశించారు. నీటి సరఫరాలో అంతరాయం ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్లు, బోర్‌వెల్‌ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వాసితుల ఖాతాల్లో పరిహారం నిధులు జమ చేసినప్పటికీ ఇప్పటివరకు ఒక్క కుటుంబం కూడా పునరావాస కాలనీలోకి వెళ్లకపోవడం ఆందోళనకరమన్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు తరహాలో ప్లాట్లను లబ్ధిదారుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేస్తే వారు ఇళ్ల నిర్మాణానికి ముందుకు వస్తారని సూచించారు. రోడ్లు, ఆలయాలు, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలలు, మిషన్ భగీరథ పైప్‌లైన్‌లు, విద్యుత్ సదుపాయాలు వంటి పెండింగ్ మౌలిక వసతుల పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. పునరావాస కాలనీ



సమీపంలోని డంపింగ్ యార్డ్‌ను నాగసాలకు తరలిస్తే నిర్వాసితులు కాలనీలోకి రావడానికి ఆసక్తి చూపుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, డీఆర్వో రామ్‌రెడ్డి, ఆర్డీఓ నవీన్, భూ రికార్డుల సర్వే ఏడీ అశోక్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులు, ఉదండాపూర్, వల్లూరు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి శక్తి, ధైర్యానికి ప్రతీక

- హనుమాన్ జయంతి వేడుకల్లో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి, మే 12 (ప్రజాజ్యోతి): ఆంజనేయస్వామి శక్తి, ధైర్యం, ఆత్మస్థైర్యం, భక్తికి ప్రతీక అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పలు ఆంజనేయ స్వామి దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చింతల హనుమాన్ దేవాలయం, నాగవరం ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తుల ఆహ్వానం మేరకు స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంజనేయస్వామి శక్తి, ధైర్యం, ఆత్మస్థైర్యం, భక్తికి ప్రతీక అని అన్నారు. కలియుగంలో మానవాళికి ఆంజనేయస్వామి స్ఫూర్తిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అందుకే ప్రతి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం ఉండటం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని చెప్పారు. చింతల హనుమాన్ దేవాలయంలో శ్రీ రామలింగేశ్వర స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు నిరంజన్ రెడ్డికి ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నందిమల్ల అశోక్, కౌన్సిలర్ మురళీ సాగర్, పెద్దముక్కల రవి, బొబ్బిలి ప్రేమ్ కుమార్, వెంకటేశ్వర గౌడ్, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధికి శాఖల సమన్వయం అవసరం:పీఎంవో డైరెక్టర్ రఘు

గద్వాల మే12(ప్రజా జ్యోతి ప్రతినిధి): పీఎండీడీకేవై (ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన)ద్వారా జిల్లాలో వ్యవసాయ,అనుబంధ రంగాల్లో రైతులు అభివృద్ధి సాధించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని భారత ప్రభుత్వ ప్రధానమంత్రి కార్యాలయం డైరెక్టర్ రఘు సూచించారు.మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో పీఎండీడీకేవై పథకం,ఆయిల్ పామ్ సాగు అభివృద్ధి,అంతర పంటల ప్రోత్సాహం తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉద్యానవన, వ్యవసాయ, పశుసంవర్ధక, పరిశ్రమలు, మత్స్య,జిల్లా సహకార సంస్థల అధికారులతో ఆయా శాఖలలో





కొనసాగుతున్న అభివృద్ధి పనులు,పథకాల అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ,ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన కేవలం గణాంకాలు,లక్ష్యాల సాధనకే పరిమితం కాకుండా రైతుల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకురావాలని అన్నారు.రైతుల ఆదాయం పెంపు,పంటల వైవిధ్యీకరణ,నీటి వినియోగ సామర్థ్య పెంపు,నేల ఆరోగ్య సంరక్షణ, సుస్థిర వ్యవసాయం,మార్కెట్ అనుసంధానం వంటి అంశాలపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్ పామ్,పప్పుధాన్యాలు,ఉద్యాన పంటలు,అంతర పంటల సాగు వైపు మళ్లేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.వ్యవసాయ, ఉద్యాన,పశుసంవర్ధక,మత్స్య,సహకార,అనుబంధ శాఖలు సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు.రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు,మొక్కలు,ఎరువులు,సూక్ష్మ నీటిపారుదల సదుపాయాలు,రుణాలు, సాంకేతిక సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.నేల సార పరీక్షలు నిర్వహించి సాయిల్ హెల్త్ కార్డుల ఆధారంగా సమగ్ర పోషక నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు, సహకార వ్యవస్థ ద్వారా మరింత రుణ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.జిల్లాలో విజయవంతంగా సాగు చేస్తున్న మోడల్ రైతులను గుర్తించి ఇతర రైతులకు ఆదర్శంగా నిలబెట్టాలని,వారి అనుభవాలను గ్రామస్థాయిలో పంచుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో వ్యవసాయం,రైతు సంక్షేమ శాఖ సీనియర్ సాంకేతిక అధికారి శ్రీకాంత్,జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అక్బర్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప,డీఆర్‌డీఓ ముషాహిదా బేగం,పశు సంవర్ధక శాఖ అధికారి శివానంద స్వామి,జిల్లా ఉపాధి కల్పనాధికారి చరణ్ దీప్,లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు,పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వరగౌడ్,మత్స్య శాఖ అధికారి షకీలా భాను,కోఆపరేటివ్ అధికారి శ్రీనివాసులు,కేవీకే శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.అనంతరం డైరెక్టర్ రఘు ఎర్రవెల్లి మండలం బీచుపల్లి ఆయిల్ ఫ్యాక్టరీ వద్ద రైతుల ఆయిల్ పామ్ నర్సరీలను పరిశీలించారు.కొండేరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం,డైరీ ఫామ్, ఫిష్ ఫామ్‌ను సందర్శించారు.జల్లాపురం సమీపంలో కూరగాయల సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు.

## పదవ తరగతిలో బలహీన విద్యార్థుల కోసం వేసవి సమ్మర్ క్యాంపు శిబిరం

మండల విద్యాశాఖ అధికారి కొర్ర సారయ్య



**నర్సంపేట మే 12 (ప్రజాజ్యోతి) :** నర్సంపేట ఆకలి కడుపుతో ఎనిమిది కిలోమీటర్లు పాదయాత్రతో చదువులు నర్సంపేట పట్టణం12 మే 2026 మంగళవారం రోజున పీఎంశ్రీ ప్రధానమంత్రి స్కూల్ ఆఫ్ రేజింగ్ ఇండియా జిల్లా ప్రజా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోడెం కాంతారావు ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి బహునూతుల రంగయ్య నాయుడు ఆదేశాల మేరకు నర్సంపేట డివిజన్ మండలాలు నర్సంపేట, నల్లబెల్లి, ఖానాపురం, చెన్నారావుపేట,నెక్కొండ పాఠశాల లో పదవ తరగతి తప్పిన విద్యార్థులకు ప్రత్యేక ఉపాధ్యాయులచే ప్రత్యేక బోధన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి కొర్ర సారయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ దుగ్గొండి మండలంలో 100% ఉత్తీర్ణత పొందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అభినందిస్తూ గతంలో ఆకలి కడుపుతో 8 కిలోమీటర్లు పాదయాత్రతో చదువులు కొనసాగి ఉన్నత స్థాయిలో ఉన్నాము వివిధ మండలాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను 12 మే 2026 నుండి 03 జూన్ 2026 వరకు ఉదయం 08 గంటల నుండి మధ్యాహ్నం12 గంటల వరకు అల్పాహారం రహదారి ఖర్చులు ఒక వెయ్యి రూపాయలు తో చక్కని బోధన కల్పించబడును.ప్రభుత్వం చక్కటి ఈ అవకాశం లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత పొంది రాష్ట్రానికి దేశానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోడెం కాంతారావు సంగెపు స్వరూప బత్తిని రాజేష్ కందుల స్వామి ల్యాద లింగమూర్తి బానోతు వెంకట్రం సమ్మెట సురేష్ లక్కి రమేష్ ఎమ్మార్పీ సభ్యులు అన్ని మండలాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే జి ఎస్ అర్



**ప్రజాజ్యోతి -మొగుళ్ళ పల్లి (మే 12) :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్ గోదాంను సందర్శించారు.నియోజకవర్గంలోని రైతులు పండించిన మొక్కజొన్న ధాన్యం రవాణా,నిల్వ,హమాలీ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. మొక్కజొన్న దిగుబడులను సరైన సమయంలో తరలించి నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని,రైతులకు నష్టం వాటిల్లకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. హమాలీ చార్జీలు, రవాణా సమస్యలు,గోదాంల సామర్థ్యం వంటి అంశాలను ప్రత్యేకంగా పరిశీలించి రైతులకు ఎటువంటి ఆలస్యం లేకుండా సేవలు అందించాలని కోరారు.రైతుల కష్టానికి తగిన గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆయన వెంట చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, వైస్ చైర్మన్ ఎండి రఫీ,స్థానిక ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

## ధూప దీప నైవేద్య అర్చకులకు ప్రధాన దేవాలయాల్లో శీఘ్ర దర్శనం

- దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ యం. హనుమంతరావు
- ధూప దీప నైవేద్య పథకం అర్చకులలో ఆనందం





**హనుమకొండ మే 12 (ప్రజా జ్యోతి) :** దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ధూప దీప నైవేద్య పథకంలో పనిచేస్తున్న అర్చకులకు రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో శీఘ్ర దర్శన సదుపాయం కల్పిస్తూ కమిషనర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ మేరకు కమిషనర్ కార్యాలయం, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హైదరాబాద్ నుంచి 11-05-2026 తేదీన ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇటీవల 05-05-2026న ప్రధాన కార్యదర్శి రెవెన్యూ (ఎండోమెంట్స్), దేవాదాయ శాఖ సంచాలకులు, ధార్మిక సలహాదారు తదితర అధికారులతో ధూప దీప నైవేద్య అర్చకుల సమావేశం జరిగింది.సమావేశంలో అర్చకులు మాట్లాడుతూ, శాఖ ద్వారా గుర్తింపు కార్డులు జారీ చేసినప్పటికీ కుటుంబ సమేతంగా ప్రధాన దేవాలయాలకు దర్శనానికి వెళ్లినప్పుడు శీఘ్ర దర్శనం కల్పించడంలేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన దేవాదాయ ధర్మాదాయ శాఖ, ధూప దీప నైవేద్య పథకం కింద గుర్తింపు కార్డు కలిగిన అర్చకులు కుటుంబ సమేతంగా రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలకు దర్శనార్థం వెళ్లినప్పుడు వారికి శీఘ్ర దర్శన సదుపాయం కల్పించాలని ఆదేశాలు జారీ చేసింది.ఈ ఉత్తర్వులను ఎవరూ ఉల్లంఘించరాదని కమిషనర్ యం. హనుమంతరావు, ఐఏఎస్ స్పష్టం చేశారు.

## మైనర్ బాలికకు న్యాయం చేయాలి

- బండి సంజయ్ కుమారుడి కేసులో నిష్పక్షపాత దర్యాప్తు జరగాలి
- బిఆర్ఎస్ సీనియర్ నేత డా. హరి రమాదేవి



**వరంగల్ సిటీ, మే 12(ప్రజాజ్యోతి) :** దేశవ్యాప్తంగా మదర్స్ డే వేడుకలు ఘనంగా జరుగుతున్న వేళ, ఒక తల్లి తన మైనర్ కుమార్తెకు జరిగిన అన్యాయంపై న్యాయం కోసం ఆవేదన వ్యక్తం చేస్తూ పోరాడుతున్న పరిస్థితి బాధాకరమని బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, వీ కేర్ ఫర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు డా. హరి రమాదేవి పేర్కొన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో ఇప్పటివరకు అరెస్ట్ జరగకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రధాని "బేటీ బచావో -- బేటీ పడావో" అంటూ బాలికల రక్షణ, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న సమయంలో, ఒక మైనర్ బాలికకు సంబంధించిన కేసులో నిందితుడిపై వేగంగా చర్యలు లేకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. ఈ కేసులో రాజకీయ ఒత్తిళ్లు పోలీసుల దర్యాప్తుపై ప్రభావం చూపుతున్నాయనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని డా. హరి రమాదేవి అన్నారు. సాధారణ కుటుంబానికి చెందిన బాలికకు న్యాయం జరిగేలా ప్రభుత్వం, పోలీసులు పూర్తిస్థాయిలో పారదర్శకంగా వ్యవహరించాలని ఆమె డిమాండ్ చేశారు. నిజంగా తన కుమారుడు నిర్దోషి అయితే కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్వచ్ఛందంగా పదవి నుంచి తప్పుకుని దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగేందుకు సహకరించాలని సూచించారు. విచారణ అధికారులకు పూర్తి స్వేచ్ఛ కల్పించినప్పుడే బాధిత బాలికకు న్యాయం జరుగుతుందని డా.హరి రమాదేవి స్పష్టం చేశారు.

### రుద్ర హనుమాన్ జయంతోత్సవం

# అంగరంగ వైభవంగా నిర్వహణ

- వేయి స్తంభాల దేవాలయ అభివృద్ధే లక్ష్యం
- ఇనుగాల వెంకట్రామిరెడ్డి



**హనుమకొండ మే 12 (ప్రజా జ్యోతి) :** వేయి స్తంభాల దేవాలయంలో మంగళవారం నిర్వహించిన రుద్ర హనుమాన్ జయంతోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.దేవాలయ ప్రాంగణంలోని పురాతన రావి--వేప చెట్లు కలిసిన పవిత్ర స్థలంలో కొలువై ఉన్న రుద్ర ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఉదయ ప్రాతఃకాలంలో విశ్వక్సేన పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం మూలమూర్తికి పంచామృతాభిషేకం, నవరసాభిషేకం, జలనారికేళాభిషేకం, సింధూర పూజ, సహస్ర నాగవల్లి దళార్చన, పట్టువస్త్ర సమర్పణ, పుష్పార్చనలు నిర్వహించారు. అలాగే గణపతి, నవగ్రహ, శ్రీ సూక్తం, మన్య సూక్తం, రుద్ర హోమాలు నిర్వహించి మహాపూర్ణాహుతి, బలిహరణ కార్యక్రమాలు చేపట్టారు.రుద్రాంశ సంభూతుడైన ఆంజనేయ స్వామివారికి వడలు, అరటిపండ్లు, మామిడిపండ్లు, చిత్రాన్నం నైవేద్యంగా సమర్పించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో మాలధారణ చేసి రాగయుక్తంగా సుందరకాండ పారాయణం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమశివ భక్తులు శివప్రసాద్ దంపతులు వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ వేయి స్తంభాల దేవాలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. దేవాలయాన్ని యునెస్కో వారసత్వ జాబితాలో చేర్చడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. దేవాలయం ముందు భాగంలో ఉన్న గృహ యజమానులతో ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయని, వారికి తగిన నష్టపరిహారం చెల్లించి సుందరీకరణ పనులు చేపడతామని వెల్లడించారు.స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ సహకారంతో పనులు ముందుకు సాగుతున్నాయని తెలిపారు. దేవాలయం అభివృద్ధికి రూ.20 కోట్ల నిధులు కేటాయించామని, ఆలయ పరిసరాల్లో 200 మీటర్ల పరిధిలో కేంద్ర పురావస్తు శాఖ అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టం చేశారు. ప్రజలు దేవాలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

వైదిక కార్యక్రమాలను ఆలయ వేద పండితులు గంగు మణికంఠేశ్వరుడు, పెండ్యాల సందీప్ శర్మ, ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్ శర్మ, మఠం ప్రణవ్ శ్రవణ్ కుమార్ తదితరులు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గుజ్జ సంపత్ రావు తన తోట నుండి తెప్పించిన మామిడిపండ్లను భక్తులకు పంపిణీ చేశారు. హనుమంతుని మహిమ హనుమంతుడు లేని శ్రీరామాయణం ఒక్క అడుగు కూడా ముందుకు సాగదని పురాణాలు చెబుతున్నాయి. తులసీదాసు రచించిన హనుమాన్ చాలీసాను ప్రతి రోజు పారాయణం చేస్తూ హనుమంతుడిని ఆరాధించడం అనేక మందికి అలవాటుగా మారింది.కార్యసిద్ధిని త్వరగా ప్రసాదించే దేవుడిగా ఆంజనేయస్వామి ప్రసిద్ధి చెందాడు.పురాణాల ప్రకారం, పార్వతీ పరమేశ్వరులు ఆకాశమార్గంలో సంచరిస్తున్న సమయంలో శివతేజస్సు అంజనాదేవికి చేరి ఆమెకు జన్మించినవాడే ఆంజనేయుడు. అందుకే ఆయనను "రుద్రాంశ సంభూతుడు"గా భావిస్తారు.శని దోష నివారణకు కూడా ఆంజనేయ స్వామి ఆరాధన విశేషమని భక్తుల నమ్మకం.సింధూరం, జిల్లేడు పూలు, తమలపాకులతో పూజిస్తే శని దుష్ప్రభావాలు తొలగుతాయని విశ్వసిస్తారు.రావణాసురుని బంధనాల నుంచి శనిదేవునికి విముక్తి కలిగించిన హనుమంతుడి భక్తుల జోలికి శని వెళ్లదని పురాణ కథనాలు పేర్కొంటాయి.

# ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- మూడు రోజుల పాటు ఉత్సవాల నిర్వహణ
- జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు






**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, మూడు రోజుల పాటు ఉత్సవ కార్యక్రమాలు జరగనున్నాయని ములుగు జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవ రావు ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాలనిర్వహణ పై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఉత్సవాల షెడ్యూల్,రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా విశిష్ట సంస్కృతి, సాంప్రదాయాలు, ప్రతిబింబించేలా ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో, జడ్పీహైస్కూల్ బాలుర పాఠశాల, జడ్పీ హై స్కూల్ బాలికల పాఠశాలలో మే 20,21,22వ తేదీలలో మూడు రోజులపాటు క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాలు, ఫుడ్ స్టాల్స్,గిరిజన నృత్యాలు,కవి సమ్మేళనం పలు అంశాలలో ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.ఉత్సవాలు నిర్వహించే వేదికలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా చూడాలని,తాగు నీరు,విద్యుత్ సౌకర్యం, వంటి అంశాలలో ఎలాంటి లోటుపాట్లు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జీ,సంపత్ రావు,ఆర్డీఓ వెంకటేష్,జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తాయి





- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాజ్యోతి -మొగుళ్ళ పల్లి (మే 12) :** సహకార బ్యాంకులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ నూతన బ్రాంచ్‌ని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, మహిళా సంఘాలు, చిన్న వ్యాపారులు సులభంగా రుణ సదుపాయాలు పొందేందుకు ఈ కొత్త బ్రాంచ్ ఉపయోగపడుతుందన్నారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ కావడం ద్వారా ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సహకార బ్యాంకుల పాత్ర ఎంతో కీలకమని, రైతులకు అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలు డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకొని పొదుపు అలవాటు పెంపొందించుకోవాలని కోరారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 33 మంది లబ్ధిదారులకు 11,21,500/- రూపాయల విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తోందన్నారు. అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి పార్టీలకతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేయడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం కేవలం వారి పార్టీ కార్యకర్తలకే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారని ఆరోపించారు. ప్రజల కష్టసుఖాల్లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలు

**మరిపెడ, మే 12 (ప్రజాజ్యోతి) :** మరిపెడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్‌సీలో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది సేవలను ప్రత్యేకంగా కొనియాడుతూ ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ.. ఆధునిక నర్సింగ్ వ్యవస్థకు పునాది వేసిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో, రోగుల ప్రాణాలను కాపాడటంలో నర్సుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. రాత్రింబవళ్లు సేవలందిస్తూ రోగులకు తల్లిలా



అండగా నిలిచే నర్సుల సేవలు స్ఫూర్తిదాయకమని అన్నారు. నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీ పరిధిలో సేవలందిస్తున్న నర్సింగ్ స్టాఫ్,పారామెడికల్ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలకు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో వారు చూపుతున్న అంకితభావాన్ని వైద్యాధికారులు అభినం దించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పూజిత, డాక్టర్ స్వామి, డాక్టర్ సౌజన్య, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ లక్ష్మికుమారి, పల్లె దవాఖాన సిబ్బంది ఝాన్సీ, ఉపేంద్ర, అఖిల, సౌజన్య, సరిత,హెల్త్ అసిస్టెంట్ వీరయ్య, నర్సింగ్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

## అలియాబాద్ సర్పంచ్ సనత్ జన్మదిన వేడుకలు

గ్రామంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన ప్రజలు, నాయకులు



**పరకాల, మే 12, (ప్రజాజ్యోతి) :** శాతరాశి సనత్ కుమార్ జన్మదిన వేడుకలను మంగళవారం అలియాబాద్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని చిన్నారులు, పెద్దలు, యువకులు కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పరకాల సీఐ క్రాంతి కుమార్ సనత్ కుమార్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. పరకాల ఫర్టిలైజర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు గందె వెంకన్న ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, బిఆర్ఎస్ నాయకులు, అభిమానులు సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎరువుల కంపెనీల 'లింకు' దోపిడీపై డీలర్ల ఆగ్రహం



**పరకాల, మే 12, (ప్రజాజ్యోతి) :** ఎరువుల కంపెనీలు అమలు చేస్తున్న 'లింకు' విధానాలతో గ్రామీణ రిటైల్ వ్యాపారం దెబ్బతింటోందని, రైతులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పరకాల మండల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గందె వెంకటేశ్వర్లు ఆరోపించారు. యూరియా ఇవ్వాలంటే డిమాండ్ లేని ఇతర ఉత్పత్తులు కొనాలని కంపెనీలు ఒత్తిడి చేస్తున్నాయని విమర్శించారు. రిటైల్ డీలర్ల మార్జిన్లు తగ్గించడంతో నిర్వహణ ఖర్చులు కూడా రాక దుకాణాలు మూతపడే పరిస్థితి నెలకొందన్నారు. సీజన్ సమయంలో యూరియా, డీఏపీకి కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. 'లింకు' విధానాన్ని వెంటనే రద్దు చేసి, డీలర్లకు 8-10 శాతం మార్జిన్ కల్పించాలని, ఎరువుల సరఫరాలో పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## అయ్యప్ప స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు



**నర్సంపేట మే 12 (ప్రజాజ్యోతి) :** నర్సంపేట పట్టణంలో 2026 మే 12 మంగళవారం రోజున శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ సేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరి కొండ మాధవశంకర్ ఆదేశాల మేరకు అభయాంజనేయ స్వామి ఆలయ దాత బొద్దుల దివాకర్,నాగరాజు కుటుంబ సభ్యులతో అభయాంజనేయ స్వామి పంచలోహ విగ్రహానికి పూజ నిర్వాహకులు దేవిష్ మిశ్రా బృందం పూజలు ఘనంగా నిర్వహించగా అభిషేకం నూతన వస్త్ర అలంకరణతో నైవేద్యం సమర్పించగా జయంతి వేడుకలు ఆలయ కమిటీ బాధ్యులు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ శింగిరి కొండ మాధవశంకర్, దేవాలయ అధ్యక్షులు సైఫా సురేష్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, చకిలం కృష్ణమూర్తి, బండారుపల్లి చెంచారావు, చిలువేరు వెంకట్రాజ్యం,శింగిరి కొండ రవీందర్,అనంతుల రామనారాయణ, ఆలయ మేనేజర్ రాము,సర్వేషం, అభయాంజనేయ స్వామి మాలధార స్వాములు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఇనగాల



**హనుమకొండ, జిల్లా ప్రతినిధి మే 12 (ప్రజాజ్యోతి) :** హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా మంగళవారం హనుమకొండలోని ప్రముఖ పుణ్యక్షేత్రం వేయి స్తంభాల దేవాలయంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణానికి విచ్చేసిన ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ), ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్ శర్మ ఘన స్వాగతం పలికారు. అనంతరం హనుమంతుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి జిల్లా ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. హనుమంతుని ఆశీస్సులతో జిల్లా ప్రజలందరికీ శుభం కలగాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వ బడులను గాలికి వదిలేసి, కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

### కాలయాపన కోసమే విద్యా వారోత్సవాలు

తుంగతుర్తి, మే 12,(ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులను గాలికి వదిలేసి కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తుందని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ... విద్యా వారోత్సవాల పేరుతో కోట్ల రూపాయలు ప్రజాదరణని వృధా



చేస్తూ పేద మరి మధ్యతరగతి విద్యార్థులను చదువుకు దూరం చేసే ప్రయత్నం తప్ప ఇంకేది కాదని మండిపడ్డారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఫీజు రియంబర్స్మెంట్ నాటి ప్రభుత్వం ఇవ్వకుండా విద్యార్థులకు ఎగగొట్టినందుకా..? విద్యార్థినిలకు ఇస్తానన్న స్కూటీలు ఇవ్వనందుకా..? విద్యా భరోసా కార్డు ఇవ్వనందుకా..? గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు విషాహారం తినీ చనిపోయినందుకా..?విద్యా వారోత్సవాలు నిర్వహించేదని ప్రశ్నించారు. వారోత్సవాల పేరుతో కాలయాపన చేయడం మానే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి పాఠ్యపుస్తకాలను సకాలంలో అందించాలని అన్నారు. పేద విద్యార్థులు చదువుకునే గురుకులాలను పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాకు నాయక్, లతీబ్, నల్లబెల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలి

### భగీరథుని కఠినంగా శిక్షించాలి నీలం పద్మ వెంకటస్వామి

ఆలేరు మే 12 (ప్రజా జ్యోతి) కరీంనగర్ ఎంపీ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ మీద ఫోక్సో కేసు నమోదైన ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ తన ఎంపీ పదవి. కేంద్ర సహాయక మంత్రి పదవులకు రాజీనామా చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ డిమాండ్ చేశారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు



24 ఏండ్ల బండి భగీరథ అసభ్యకరంగా 17 సంవత్సరాల బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించి బాలికను మోసం చేసే ఇలాంటి వారిని ఉరితీయాలని బాలికలు అంటే ఇంత చిన్న చూపు అని ప్రశ్నించారు. ఉన్నత పదవిలో ఉండి మీ కొడుకుకు బుద్ధులు నేర్పించకుండా మీ కొడుకు గురించి పలు వార్తలు వచ్చిన స్పందించలేదు. బండి భగీరథకు బేలు ఇవ్వకుండా కఠినంగా శిక్షించాలని తీవ్రంగా మండిపడ్డారు. బిజెపి నేతలు ప్రతిసారి భేటీ బచావో బేటి పడావో అంటూ చెపుతారు కానీ అవి మాత్రం పాటించరని ఎద్దే వేశారు మైనర్ బాలిక పట్ల నేరం చేయడమే కాక హనీ ట్రాప్ 5 కోట్లు డిమాండు అంటూ కొత్త డ్రామాలు మొదలు పెట్టారని పద్మ విమర్శించారు. హిందూ ధర్మం. భారతదేశం. భారతమాత జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేసే ఆయన సొంత ఇంట్లోని కుమారునికి నైతికత నేర్పడం మర్చిపోయారా ప్రశ్నించారు .బండి సంజయ్ కుమార్ రెడ్డి పై గతంలోనూ పలు ఆరోపణలు ఉన్నాయని కుమారు డి పై కేసు నమోదైన విషయాన్ని సీరియస్గా తీసుకొని బండి సంజయ్ తన పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట ప్రభుత్వం బాధిత మైనర్ బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని తెలియజేశారు నేరస్తుని వెంటనే అరెస్టు చేసి జైలుకి పంపే వరకు ఆ కుటుంబానికి తగిన భద్రత కల్పించాలని జిల్లా ప్రెసిడెంట్ నీలం పద్మ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీలు పుష్ప. కవిత. బి కవిత. బ్లాక్ అధ్యక్షురాలు సంగీత. కల పట్టణ అధ్యక్షురాలు కవిత రాణి తదితరులు పాల్గొన్నారు.

## యువ కవి జాంగిర్ ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సునీత

ఆలేరు మే 12 ప్రజా జ్యోతి: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని పటేల్ గూడెం గ్రామానికి యువ కవి బండ జాంగిర్ ను మాజీ ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పాత్ర పోషించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. మీలాంటి వ్యక్తి బిఆర్ఎస్ పార్టీకి ఎప్పుడు అవసరమన్నారు. ఇటీవల జాంగిర్ కు యాక్సిడెంట్ కావడం బిఆర్ఎస్ పార్టీకి నష్టమన్నారు. త్వరగా కోలుకోవాలని దేవుని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గంగుల శ్రీనివాస్, శ్రీశైలం, శ్రీధర్, కనకరాజు, వార్డు సభ్యులు బండ రమేష్ తదితరులు పాల్గొన్నారు



## నర్సుల సేవలు వెలకట్టలేనివి: సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు

### లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ నర్స్ దినోత్సవ వేడుకలు

తుంగతుర్తి, మే 12,(ప్రజా జ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సేవలు అందించడం నోబల్ వృత్తి అని, అలాంటి వృత్తిని ఎంచుకొని సేవలు అందిస్తున్న నర్సింగ్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి అని తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. నర్సింగ్ సేవల మాతృమూర్తి ఫ్లోరేన్స్ నైటింగేల్ జయంతి నీ పురస్కరించుకొని తుంగతుర్తి మండల కేంద్రం లోనీ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్నీ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం ఆస్పత్రి నర్సులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గుడిపాటి సైదులు మాట్లాడుతూ... రోగుల పట్ల అంకితభావంతో వారందించే సేవలు ఎంతో విలువైనవని ప్రశంసించారు. ఫ్లోరెంట్స్ నైటింగేల్ త్యాగపూరిత కృషి ఫలితంగా నేడు నర్స్ వృత్తి కొనసాగడమే కాకుండా వైద్య రంగానికి వన్నెతెచ్చారని కొనియాడారు. కోవిడ్ సమయంలో కూడా రోగులకు భరోసా కల్పిస్తూ వందలాది మందిని మళ్లీ ఆరోగ్యంగా ఇంటికి వెళ్లేలా చేసిన ఘనత నర్సులదని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు పాలవరపు సంతోష్,సభ్యులు కేదారి,గుండగాని రాము, ఓరుగంటి శ్రీనివాస్, పులుసు వెంకటనారాయణ, లక్ష్మణ్ రావు,యనగందుల యాదగిరి, అభిలాష్, గుజ్జ భాస్కర్,ఇన్చార్జి నర్సింగ్




ఆఫీసర్ సువర్ణ, సీనియర్ నర్స్ అనిత, నాగమణి, శారద, ఏఎన్ఎం కవిత తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల దోపిడి పై ప్రభుత్వం స్పందించి, అరికట్టాలి

### తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ, మే 12,( ప్రజాజ్యోతి ): రాష్ట్రంలో విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన ప్రైవేటు పాఠశాలలు మరియు కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూళ్లు చేయడాన్ని ప్రభుత్వం నియంత్రించాలని బీసీ యువజన



సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్య వ్యాపారంగా మారి సామాన్య ప్రజలు చదువుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. తెలంగాణలో ఇంత విచ్చలవిడిగా విద్య వ్యాపారంకొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. పాఠశాల విద్యకి లక్షలరూపాయలు చెల్లించాలని యాజమాన్యాలు చెప్తా ఉంటే విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలకు గురవుతున్నారని,పిల్లని చదివించుకోవాలంటే భూమి లేదా బంగారం అమ్ముకున్న కూడా ఫీజులకు సరిపోని పరిస్థితి రాష్ట్రంలో ఉందని వాపోయారు. ఎంతో మంది పేద విద్యార్థులకు తోడుగా ఉండాల్సినటువంటి ప్రభుత్వం .ప్రైవేటు మరియు కార్పొరేట్ పాఠశాల ఫీజుల దోపిడి అరికట్టడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలిగా ఫీజు వసూళ్లు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోకపోతే మాత్రం పాఠశాలలపై దాడులు చేస్తామని ఆయన హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్క నాగేశ్వరరావు, బీసీ యువజన సంఘం జిల్లా నాయకుడు కొత్రపిడత సురేష్, బీసీ విద్యార్థి సంఘం పట్టణ నాయకుడు ఉపేందర్, బీసీ యువజన సంఘం నాయకులు రమేష్, ఉదయ్, రమేష్, కిరణ్ ,రామ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మిల్లర్లు దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి

- జాప్యం చేసి రైతులను ఇబ్బందులు పెట్టొద్దు
- మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి ఆదేశం
- పలు రైస్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు

మిర్యాలగూడ, మే 12,( ప్రజాజ్యోతి ): రైస్ మిల్లులలో ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలని, రికార్డులను పరిశీలించారు. ధాన్యం దిగుమతి ప్రక్రియలో జాప్యం జరుగుతుందని దీనివల్ల కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిలువలు పెరిగిపోవడమే కాకుండా రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆయన గుర్తించారు. రైస్ మిల్లుల యాజమాన్యాలతో సమావేశమైన ఆర్డీవో మిల్లుల వద్దకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని, వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో రైతులు







జాప్యం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి మిల్లర్లను ఆదేశించారు. మంగళవారం తెల్లవారుజామునుండే రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి పలు రైస్ మిల్లులలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మిల్లులో దిగుమతి ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. మిల్లులు ఎంత ధాన్యం దిగుమతి అవుతుందని ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల వారు ఇబ్బందులు పడుతున్నారని ఈ పరిస్థితులన్నిటిని మిల ర్లు గమనించాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాప్యం లేకుండా దిగుమతి చేసుకోవాలని కోరారు. ఈ తనిఖీలలో తహసిల్దార్లు జవహర్ లాల్, హేమలత, సరోజ, చంద్రశేఖర్, రాగ్యా నాయక్, ఆర్ ఐ లు రామకృష్ణ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక 10కే రన్

- స్పెషల్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో అవగాహన రన్
- జేన్కో కార్యాలయం నుంచి 420 లెఫ్ట్ వరకు
- ప్రభుత్వ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలి
- అసిస్టెంట్ కమాండెంట్ బి.రాజు

నాగార్జునసాగర్ మే 12 ప్రజా జ్యోతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా నాగార్జున సాగర్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రత్యేక రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు,మంగళవారం ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా,జోన్ డి.ఐ.జి మాధవరావు ఆదేశాల మేరకు,నాగార్జున సాగర్ ఎస్ పి ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బి రాజు,ఇన్స్పెక్టర్లు,శ్రీనివాసరావు,ప్రతాప్ నాయుడు,నేతృత్వంలో 10 కే రన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు,ఈ సందర్భంగా జెన్కో సి.ఈ కార్యాలయం నుంచి 420 లెఫ్ట్ వరకు సాగిన ఈ రన్ లో సిబ్బంది అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు.కేవలం పరుగుకే పరిమితం కాకుండా,పలు రకాల వ్యాయామాలు, మరియు టేబుల్ కార్డ్స్ ప్రదర్శన నిర్వహించారు.జెన్కో మరియు నాగార్జున సాగర్ డ్యామ్ యూనిట్లు,10 కిలోమీటర్లు,5 కిలోమీటర్లు మరియు 2 కిలోమీటర్ల విభాగాలుగా నిర్వహించారు,ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ రాజు మాట్లాడుతూ,ఫిజికల్ ఫిట్నెస్,మానసిక ప్రశాంతత కోసం నడక తప్పనిసరి తమ ఆరోగ్యం పట్ల కూడా అవగాహన కలిగి ఉండాలని,ఇలాంటి కార్యక్రమాలు మానసిక ఉల్లాసాన్ని,శారీరక దృఢత్వాన్ని ఇస్తాయని తెలిపారు.ఈ ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పాల్గొంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన 10 కే రన్ కార్యక్రమంలో జెన్కో మరియు నాగార్జునసాగర్ డ్యామ్ ఎస్ పి ఎఫ్ అధికారులు,సిబ్బంది సంయుక్తంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ పి ఎఫ్ జెన్కో ఆర్ఐ ప్రతాప్ నాయుడు,







సాగర్ డ్యాం ఎస్ పి ఎఫ్ ఆర్ఐ శ్రీనివాసరావు,ఎస్ఐలు రఘుబాబు,వెంకటేశ్వర్లు,ఏ ఎస్ఐలు పుల్లయ్య,మహమ్మద్, జెన్కో, సాగర్ డ్యాం ఎస్ పి ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బండి భగీరథ పై పోక్సో కేసు నమోదు చేయాలి: ఉస్తేల సృజన

చింతలపాలెం, మే 12 (ప్రజా జ్యోతి) : మహిళలపై రోజురోజుకు అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నాయని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల



సృజన ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం చింతలపాలెం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పెట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో 17 ఏళ్ల మైనర్ బాలికపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ అత్యాచారానికి పాల్పడ్డాడని బాధిత కుటుంబం ఆరోపిస్తున్నదని తెలిపారు. ఈ ఘటనపై పోక్సో కేసు నమోదు చేయాలని బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించినప్పటికీ, కేసు నమోదు చేయకుండా ఒత్తిడులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ కేసులో నిందితుడిపై వెంటనే పోక్సో కేసు నమోదు చేసి, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా సత్వర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేసు నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. అధికార ప్రభావంతో కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ, చింతలపాలెం మండల కార్యదర్శి బోరెడ్డి హైమావతి, మండల అధ్యక్షురాలు భీమిశెట్టి పద్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నిడమనూరులో వైభవంగా హనుమాన్ జయంతి

నిడమనూరు,మే12(ప్రజాజ్యోతి): మండలంలోని నిడమానూరు,శాఖాపురం గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం హనుమన్ జయంతి వేడుకలు





కన్నులపండువగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి 108 కలశాలతో విశేష అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చేకూరి సూరయ్య నారాయణ, ఆలయకమిటీ సభ్యులు బారెడ్డి లక్ష్మారెడ్డి, గంటా శ్రీనివాస్, మాజీ సర్పంచ్లు ఇరుగుల వెంకట్ రెడ్డి,చిన్నాల వెంకటయ్య,కున్ రెడ్డి బాలకోటి రెడ్డి,బారెడ్డి యాదగిరి,లచ్చినర్సు, రాముడు,పోలగోని మహేష్, మహేష్ రెడ్డి,నరేష్ రెడ్డి,తదితరులు, పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాలి

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట జిల్లా ప్రతినిధి మే 12(ప్రజాజ్యోతి): సూర్యాపేట జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం



చేయాలని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.మంగళవారం నాగారం, జాజిరెడ్డి గూడెం, తిరుమలగిరి మండలాల్లోని తిమ్మాపురం, ఇటూరు, తొండ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు.అనంతరం నాగారం, తిరుమలగిరి పరిధిలోని వాసవి రైస్ ఇండస్ట్రీ, ఏఎస్ఆర్ రైస్ ఇండస్ట్రీ , సోమేశ్వర రైస్ ఇండస్ట్రీ మిల్లులను సందర్శించి, ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు.మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్ లోడింగ్ చేయాలని, మిల్లర్లు ధాన్యం దిగుమతిలో జాప్యం చేయకూడదని సూచించారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.కలెక్టర్ వెంట తహశీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో ఝాన్సీ, తిరుమలగిరి తహశీల్దార్ కంట్లమయ్య, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ కొడుకును వెంటనే అరెస్ట్ చేయాలి



ప్రజాజ్యోతి, బాల్కొండ మే 12 కేంద్రమంత్రి బండి సంజయ్ కొడుకు బండి భగీరథ్ ను వెంటనే అరెస్టు చేయాలని బాల్కొండ మండల బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మైనర్ బాలికలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కేంద్ర మంత్రి కొడుకును ఇంతవరకు అరెస్టు చేయలేదని ఆయన విమర్శించారు. పోస్కో కేసు నమోదైన చర్యలు తీసుకోకపోవడం భావ్యం కాదని అన్నారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మహమ్మద్ ఇఫ్తేఖార్, డాక్టర్ ప్రసాద్ గౌడ్, నారాయణ, బాల రాజేశ్వర్, సయ్యద్ ఫయాజ్, ప్రసాద్, లక్ష్మీనారాయణ, ఎస్ ప్రసాద్, కన్న పోశెట్టి, షేక్ రహీముద్దీన్, శ్రీనివాస్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

### గంగారం తండా ఇంటింటా జనగణ సర్వేకు
## ప్రజల సహకారం అవసరం ఉప సర్పంచ్ ధూమ



ఇందల్వాయి ( ప్రజా జ్యోతి) మే. 12 ఇందల్వాయి మండల పరిధిలోని గంగారం తండా గ్రామపంచాయతీ పరిధిలో జనగణ ఇంటింటి సర్వే కార్యక్రమం కొనసాగుతోంది ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ధూమ ఆఫీసర్ శ్రీదేవి పాల్గొని గ్రామ ప్రజలకు జనగణ సర్వే ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్ద లు దిలీప్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం తప్పనిసరిగా జన గణన సర్వేలో పాల్గొని సరైన వివరాలు అందించాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ సర్వే ద్వారా గ్రామ అభివృద్ధికి అవసరమైన సమాచారం సేకరించబడుతుందని ఆయన తెలిపారు. అనంతరం ఉపసర్పంచ్ ధూమ ఆఫీసర్ శ్రీదేవి మాట్లాడుతూ గ్రామంలో నిర్వహిస్తున్న జనాభా సర్వే కు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు సర్వే కోసం ఇంటింటికి వచ్చే అధికారులకు సిబ్బందికి ప్రజలు పూర్తి వివరాలు అందించాలని సహకరించాలని ఆమె కోరారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి మద్దతు తెలుపుతూ సర్వేన విజయవంతం చేయాలని సంకల్పించారు.

### సుడిగాలిల పర్యటిస్తూ రైతుల
## బాగోగు తెలుసుకుంటున్న ఎమ్మార్వో బాలయ్య





ఇందల్వాయి( ప్రజా జ్యోతి) మే. 12 ఇందల్వాయి మండల కేంద్రంలోని సుడిగాలిలా పర్యటిస్తూ ఎండను కూడా లెక్క చేయకుండా రైతుల యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మార్వో బాలయ్య. సరైన టైంలో చేరవలసిన గమ్యానికి రైతుల ధాన్యాన్ని చేర్చడానికే ఆయన ప్రయత్నం అని ఆయన అన్నారు పండించిన పంటను రైతులు సరైన టైంలోనే రైస్ మిల్లకు చేరే విధంగా ఆయన యొక్క ప్రయత్నం అని రైతులు వాపోతున్నారు. రైస్ మిల్లర్లతోని మాట్లాడుతూ వర్షాలు పడే అవకాశం ఉందని త్వరగా రైస్ మిల్క్ చేర్చాలని ఎమ్మార్వో ప్రయత్నం. ఈ ప్రయత్నానికి రైతులు సహకరించాలని. ఐకెపివారు సొసైటీ వారు సహకరించి ట్రాన్స్పోర్ట్ త్వరగా చేయించాలని వారిని కోరారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో బాలయ్య జిపిఓ లు ఆర్ ఐ సిబ్బంది పాల్గొన్నారు

### గ్రామపంచాయతీ పర్మిషన్
## తీసుకొని ఇంటి నిర్మాణం చేపట్టాలి
### – నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగం



(నందిపేట్ ప్రజా జ్యోతి ): గ్రామపంచాయతీ పర్మిషన్ తీసుకున్న తర్వాతనే ఇంటి నిర్మాణం చేపట్టాలని గ్రామంలోని మేస్త్రీలకు నందిపేట సర్పంచ్ ఎర్రం లింగం ఆదేశించారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో మేస్త్రీలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో చేపట్టే ప్రతి నిర్మాణం గ్రామపంచాయతీ నిబంధనల ప్రకారం ఉండాలని స్పష్టం చేశారు. ఇల్లు నిర్మించే ముందు తప్పనిసరిగా అనుమతి పొందాలని, సెట్‌బ్యాక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. రహదారులకు ఎలాంటి ఆటంకం కలగకుండా మెట్లు నిర్మించాలని, గ్రామంలోని 20 అడుగుల రోడ్లను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. గ్రామాభివృద్ధి, భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఈ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సర్పంచ్ స్పష్టం చేశారు.

### బస్టాండ్ ఏర్పాటు చేయాలని
## మంత్రి పొన్నంను కలిసిన కాంగ్రెస్ నేతలు
### – కామారెడ్డిలో బస్టాండ్ ఏర్పాటుకు సానుకూలంగా స్పందించిన మంత్రి



కామారెడ్డి ప్రతినిధి మే 12. (ప్రజాజ్యోతి) కామారెడ్డి జిల్లా కేంద్రంలో హైవే ఎక్స్ ప్రెస్ ప్రత్యేక బస్టాండ్ ఏర్పాటు చేయాలని తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. మంగళవారం రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కామారెడ్డి కాంగ్రెస్ నేతల బృందం ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో నూతన బస్టాండ్ ఏర్పాటు విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా టిఎస్ ఆర్టీసీ ఎండి, కామారెడ్డి జిల్లా కలెక్టర్ బస్టాండ్ ఏర్పాటు సాధ్యసాధ్యాలు, స్థలం కేటాయించాలని మంత్రి ఆదేశించారు. కామారెడ్డి జిల్లా కేంద్రం ఉత్తర తెలంగాణలో ప్రముఖ పట్టణంగా విస్తరిస్తుందని పలు విషయాలు మంత్రి పొన్నం దృష్టికి టీపీసీసీ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి తీసుకొచ్చారు. ప్రస్తుతం కామారెడ్డి పట్టణం లక్ష జనాభాకు పైగా ఉందని, ప్రస్తుతం పట్టణం నలువైపులా విస్తరిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న కొత్త బస్టాండ్ విస్తీర్ణం తక్కువగా ఉండటం వల్ల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరోవైపు 44వ జాతీయ రహదారి విస్తరణ జరగడంతో ఆర్మూర్, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, నాగ్ పూర్, కోరుట్ల, మెట్ పల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు కామారెడ్డి పట్టణంలోకి రావడం లేదు. నాన్ స్టాఫ్ బస్సుల కారణంగా కామారెడ్డికి రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారు. కామారెడ్డి 44వ జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ పరంగా, ఆర్టీసీకి అనుకూలంగా భూమి ఉన్నందున అ స్థలంను కేటాయించి నాన్ స్టాఫ్ బస్టాండ్ కానీ హైవే బస్టాండ్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోగలరని కోరుచున్నాము. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో కీలకమైన కామారెడ్డి నుంచి రాకపోకలు కొనసాగించేలా హైవే బస్టాండ్ ఏర్పాటు చేయాలనీ కోరుచున్నాము. దీని కారణంగా ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు రాకపోకలు సాఫీగా జరిగే అవకాశం ఉంటుందని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మంత్రికి ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. మంత్రిని కలిసిన వారిలో అడ్లూర్ కౌన్సిలర్ గడ్డమిది మహేష్, డీసీసీ ఉపాధ్యక్షులు నిమ్మ విజయ్ కుమార్ రెడ్డి, క్రీడా అధ్యక్షులు గణగోన లక్ష్మి నర్సాగౌడ్, కాంగ్రెస్ నేతలు శ్రీధర్ రావ్ ఉన్నారు.

# పోలీసుల సమర్థవంతమైన దర్యాప్తు
### – హత్య కేసు నిందితుడికి జీవిత ఖైదు 15,000 జరిమానా – జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర



కామారెడ్డి ప్రతినిధి మే 12. (ప్రజాజ్యోతి) అత్యాశ, కోపం, క్షణికావేశం వంటి భావోద్వేగాలు మనిషిని నేర మార్గంలోకి నెడతాయి. డబ్బు లేదా ఆస్తి కోసం తోటి మనిషి ప్రాణం తీస్తే, చట్టం ముందు ఎవరూ తప్పించుకోలేరని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది. సమాజంలో నేరాలు పెరగకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవిస్తూ, వివాదాలను శాంతియుతంగా మరియు చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలి. వ్యక్తిగత గొడవలు, ఆస్తి తగాదాల కారణంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చివరకు జీవితాంతం జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుంది. ప్రజల రక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న పోలీసులు, నేరం చేసిన వారు ఎంతటి వారైనా సరే శాస్త్రీయ ఆధారాలతో వారిని గుర్తించి, బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు కట్టుదిట్టంగా చర్యలు కొనసాగిస్తారని జిల్లా ఎస్పీ తెలిపారు. తేది:14.11.2022 నాడు పిర్యాదిదారుడు కాసు యాదగిరి, కాట్రాల గ్రామ నివాసి. తన తమ్ముడు కోరే సాయి జగదీష్ (మృతుడు) ముంబయిలో నివసించేవాడు. మృతునికి చెందిన వ్యవసాయ భూమిని పది సంవత్సరాలుగా కుర్మా సాయిలు (నిందితుడు) కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ఇటీవల జగదీష్ తన అన్న కూతురు పెళ్లి కోసం కొంత భూమి అమ్మడానికి గ్రామానికి రాగా, కుర్మా సాయిలు అడ్డుపడడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అనంతరం జగదీష్ కనిపించకుండా పోయాడు. గ్రామస్తుల సమాచారం మేరకు బిక్నూర్ శివారులోని ఎర్రగట్ల అటవీ ప్రాంతంలో జగదీష్ మృతదేహం సగం కాలిన స్థితిలో లభించింది. ఈ ఘటనపై భిక్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**కేసు వివరాల్లోకెళ్తే..**

కాట్రియాల్ గ్రామానికి చెందిన జగదీష్ తన అన్న కూతురు పెళ్లి కోసం డబ్బు అవసరమవడంతో గ్రామంలోని తన రెండు ఎకరాల భూమిని అమ్మాలని నిర్ణయించుకున్నాడు. ఐదేళ్లుగా ఆ భూమిలో కుర్మా సాయిలు (నిందితుడు) కౌలుకు గంధపు చెట్లు పెంచుతున్నాడు. భూమి అమ్ముడైతే తనకు భవిష్యత్తులో వచ్చే లాభం పోతుందని భావించిన నిందితుడు, జగదీష్‌ను హత్య చేస్తే భూమిపై ఎవరూ హక్కు కోరరని భావించి పథకం రచించాడు. 2022 నవంబర్ 13న జగదీష్‌ను "మందు తాగుదాం" అంటూ తన బైక్‌పై లక్ష్మాపూర్, బిక్నూర్ ప్రాంతాలకు తీసుకెళ్లి పలుమార్లు మద్యం తాగించాడు. రాత్రి ఎర్రగట్టులో జగదీష్ తీవ్ర మత్తులో ఉన్న సమయంలో బండరాయితో తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని కొద్దిదూరం ఈడ్చి గుంతలో పడేసి, శరీరంపై బట్టలు ఉంచి మద్యం పోసి నిప్పంటించి, ఆధారాలు చెరిపివేయడానికి ప్రయత్నించాడుపరిశోధనలో భాగంగా పిర్యాది ఇంటివారిని చుట్టుపక్కల వారిని విచారించి, సరియగు సాక్షాలను సేకరించి నేరస్తులు అయిన కుర్మా సాయిలు, (తండ్రి) శివరాజు ను అరెస్టు చేయడం తదుపరి కోర్టు యందు అభియోగ పత్రం వేయడం జరిగింది. కేసులో సాక్షులను విచారించి, సాక్షాదారాలను పరిశీలించి కేసు రుజువు కావడం జరిగినదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. సిహెచ్. విఆర్ఆర్ వర ప్రసాద్ నిందితునికి జీవిత ఖైదు మరియు రూ.15,000/- రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు ఇవ్వడం జరిగినది. పోలీసు తరపున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్ గౌడ్, సూర్యప్రసాద్, ఈ కేసును సరియగు పద్ధతిలో విచారణ చేసిన అప్పటి భిక్నూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుపతయ్య మరియు అప్పటి ఎస్ఐ కె. ఆనంద్ గౌడ్, ప్రస్తుత ఎస్ఐ డి. ఆంజనేయులు, ప్రస్తుత భిక్నూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జె. నరేష్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్సై రామేశ్వర్ రెడ్డి, సిడిఓ సంజీవ రావు లను జిల్లా ఎస్పీ అభినందించడం జరిగింది.

## బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు



కామారెడ్డి ప్రతినిధి మే 12. (ప్రజాజ్యోతి) మంగళవారం మాచారెడ్డి మండల కేంద్రములో కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ సాయి ఆకృత్యాలు మైనర్ బాలికలు మాయ మాటలు చెప్పి లోబరుచుకొని కూల్ డ్రింక్ లో మత్తుమందు కలిపి తన ఫామ్ హౌస్ లో అనేకసార్లు అత్యాచారం చేసిన ఆయనకు ఫోక్సుకేస్ నమోదు చేయాలని వెంటనే అరెస్ట్ చేయాలని చట్టం ప్రకారము దోషిగా శిక్ష వేయాలని మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ నౌసిలాల్ నాయక్ అధ్వరంలో రాస్తారోకో ధర్నా బండి సంజయ్ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. నౌసిలాల్ నాయక్ మాట్లాడుతూ బిజెపి నాయకులు దేశం కోసం ధర్మం కోసం అంటూ అనేక ప్రగల్భాలు పలికే బీజేపీ నాయకులు కేంద్ర హోమ్ శాఖ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరత విషయంలో ఎందుకు స్పందించడం లేదు..ఒక మైనర్ బాలిక ను పలు సార్లు స్నేహం పేరుతో ఫామ్ హౌస్ కు రప్పించుకొని కూల్ డ్రింక్స్ లో మత్తు మందు కలిపి అత్యాచారానికి పాల్పడ్డ సంఘటనపై బీజేపీ ఇంకా ఎందుకు మౌనంగా ఉంది..ఇక్కడ హిందు బాలికకు అన్యాయం చేసిన బండి భగీరత పై చర్యలు తీసుకోవడం లో బీజేపీ మౌనాన్ని ఏమనాలి..కంచే చేను మేసిన చందంగా కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కొడుకు బరితెగించి చేసిన ఈ వికృత క్రీడలో బండి సంజయ్ కు బాధ్యత లేదా..బీజేపీ పార్టీ కి, కేంద్ర ప్రభుత్వానికి సమాజం పట్ల బాధ్యత ఉంటే వెంటనే బండి సంజయ్ ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి. బండి సంజయ్ కు నీతి, నిజాయితీ ఉంటే బండి సంజయ్ ఎంపీ,, మంత్రి పదవికి రాజీనామా చేసి కేసు విచారణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగే విదంగా సహకరించాలని కోరారు..బీజేపీ దేశం కోసం, ధర్మం కోసం చేసే రాజకీయాలు ఇక్కడ నిరూపించుకోవాలని నౌసిలాల్ నాయక్ కేంద్ర మంత్రి బండి కు సవాల్ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు రాజిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత రావుల ప్రభాకర్, ఎస్సీ అధ్యక్షులు రామచంద్రం, మైనారిటీ అధ్యక్షులు అస్లాం ,స్థానిక సర్పంచులు వివిధ గ్రామ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు, ఉప సర్పంచ్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బండి సంజయ్ కుమారుడు
## బండి భగీరత్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి





రుద్రూర్, మే 12 (ప్రజా జ్యోతి) : బండి సంజయ్ కుమారుడు బండి భగీరత్ మైనర్ బాలికపై జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. మైనర్ బాలిక పై సంబంధించిన ఫోక్సో కేసులో తక్షణమే బండి భగీరత్ ను అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలని మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రుద్రూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ తారాబాయి, ఎస్సై సాయన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బండి సంజయ్ కుమారుడు బండి భగీరత్‌పై మైనర్ బాలికకు సంబంధించిన పోక్సో కేసులో తక్షణమే అరెస్ట్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండల ఇంచార్జ్ గాండ్ల మధు, నాయకులు దౌర్ సాయిలు, కొత్తపల్లి రవికిరణ్, సిరిగది శేఖర్, కర్రోళ్ల వెంకటేష్, జువ్వల శ్రావణ్, పార్వతి ప్రవీణ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ సంస్థ ద్వారా రైతులు విత్తనాలు కొనుగోలు
## చేయాలని కోరిన తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి





సిరికొండ( ప్రజా జ్యోతి )మే 12 సిరికొండ మండలం కొండూరు గ్రామంలో తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వ విత్తనాల పైన అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ అన్వేష్ రెడ్డి గారు మాట్లాడుతూ రైతులకు తెలంగాణ సీడు సంస్థ ద్వారా నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచడం జరుగుతుంది తెలిపారు, ప్రభుత్వం గుర్తించిన ఎనిమిది రకాల విత్తనాలు రైతులు సాగు చేయాలని సూచించారు. రైతులకు బిపిటి 5204, కేఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048, వరి విత్తన రకాలు అందుబాటులో ఉన్నావని సూచించారు. రైతులు ప్రైవేట్ కంపెనీల విత్తనాల సాగును తగ్గించుకొని ప్రభుత్వ సంస్థ ద్వారా వారి విత్తనాలు తీసుకోవాలని కోరారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ శ్రీ తాహీర్ బీన్ గారు మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. కీరకమైన పంట వేయడం వలన నెల సార్వంతం కోల్పోయి మార్కెట్లో డిమాండ్ కుమించి సప్లై ఉండడం వల్ల డిమాండ్ తగ్గే అవకాశం ఉందని చూపించారు. ఆయిల్ పంప్ అంట పప్పు దినుసులు సాగు చేయడం వల్ల రైతులకు మంచి లాభాలు ఉన్నాయని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లతా భాస్కర్, పాక్స్ చైర్మన్ గంగాధర్, కాంగ్రెస్ మండల్ ప్రెసిడెంట్ రవి, తెలంగాణ సీడ్ డి ఎం రఘు, డిసిసి ఎర్రన్న, ఝశీ నర్సయ్య మరియు రైతులు పాల్గొనారు.

## లయన్స్ భవనంలో కంటి వైద్య శిబిరం






ప్రజా జ్యోతి,బాల్కొండ మే 12 బాల్కొండ మండలం కిసాన్ నగర్ లోని లయన్స్ భవనంలో మంగళవారం బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పుణ్యరాజు 30 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో మోతి బిందు ఉన్న వారిని గుర్తించి శస్త్ర చికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చాకు లింగం, జోనల్ చైర్మన్ జ్ఞాన సాగర్ రెడ్డి, కోశాధికారి వంశీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అంగరంగ వైభవంగా
## హనుమాన్ జయంతి ఉత్సవాలు

బీబీపేట్ ప్రజా జ్యోతి మే 12 బీబిపేట మండల కేంద్రంలో చెరువు కట్ట వద్ద ఉన్న హనుమాన్ మందిరంలో ఎస్ ఎస్ సి 2001-2002 బ్యాచ్ వారి ఆధ్వర్యంలో మంగళవారం రోజున హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఉదయం7.30 ని. లకు సింధూర పూజ అనంతరం 8.30 ని లకు గణపతి హోమం, నవగ్రహ హోమం, హనుమాన్ హోమము నిర్వహించడం జరిగింది. అనంతరం మధ్యాహ్నం 1.30ని. లకు మహా అన్న ప్రసాద వికరణ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పల సాత్విక సాయి, మండల రెవెన్యూ అధికారి గంగాసాగర్, మండల అభివృద్ధి అధికారి పూర్ణ చంద్రోదయ కుమార్, గ్రామ సెక్రెటరీ రమేష్ కుమార్, గ్రామ వార్డు సభ్యులు, పుర ప్రముఖులు, గ్రామ పెద్దలు, హనుమాన్ భక్తులు మరియు బ్యాచ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# ధాన్యం సేకరణ వేగవంతంగా చేయాలి

– జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్






మెదక్ (ప్రజాజ్యోతి ) మే 12 : ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత వేగవంతంగా చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు, సివిల్ సప్లై, వ్యవసాయ, మార్కెటింగ్, ట్రాన్స్పోర్ట్ , పోలీస్ , గ్రామీణాభివృద్ధి, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు,ఇతర శాఖల అధికారులతో గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలా కొనసాగుతుందో అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లులలో ఎంతమంది హమాలిలు ఉన్నారని , ఎన్ని లారీలు ఉన్నాయని తాసిల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత వేగంగా జరగాలని, అన్లోడింగ్ ప్రక్రియలో హమాలీల సంఖ్య పెంచుకోవాలని, లారీల సంఖ్యను పెంచాలని, లారీలు అందుబాటులో లేకుంటే డీసీఎంలు, ట్రాక్టర్లను కూడా అనుమతించాలని , అధికారులందరూ క్షేత్రస్థాయిలో ఉండాలని,అకాల వర్షాలతో ధాన్యాన్ని కాపాడడానికి టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలనీ అధికారులను ఆదేశించారు. మిల్లర్లు అన్లోడింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి లారీలను అందుబాటులో ఉంచలన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ అంబాదాస్ రాజేశ్వర్,ఆర్డీఓ రమాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, సివిల్ సప్లై అధికారి నిత్యానంద, ట్రాన్స్ పోర్ట్ అధికారి వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్య సాధనే ధ్యేయం కావాలి



నర్సాపూర్, మే 12 (ప్రజాజ్యోతి) విద్యార్థులు చదువుతో పాటు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకున్నప్పుడే ఉన్నత లక్ష్యాలను సాధించగలరని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కళాశాలలో 'విద్యార్థి వికాస దినోత్సవాన్ని' ఘనంగా నిర్వహించి, విద్యార్థులకు యోగా శిక్షణ ఇచ్చారు. యోగా ద్వారా ఒత్తిడిని అధిగమించి ఏకాగ్రతను పెంచుకోవచ్చని ఆయన సూచించారు. అనంతరం సీపీజిఈటీ వంటి పీజీ ప్రవేశ పరీక్షలకు సన్నద్ధమయ్యే విధానంపై విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ ఇచ్చారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం ఆదెప్ప, రమేష్, ఖాజా ఆరిఫ్, అనిత, సురేష్ కుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మిరుదొడ్డిలో రైతుల గోస

– సమస్య పరిష్కారానికి వ్యవసాయ కమిషన్ చైర్మన్ హామీ





మిరుదొడ్డి, మే 12,(ప్రజాజ్యోతి): మిరుదొడ్డి మండల వ్యవసాయ మార్కెట్ ను రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి మంగళవారం సందర్శించారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పొద్దుతిరుగుడు, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. గత నెల రోజులుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి పడిగాపులు కాస్తున్నామని, ప్రభుత్వం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పొద్దుతిరుగుడు కొనుగోళ్లు నిలిచిపోవడంతో దళారులను ఆశ్రయించాల్సి వస్తోందని, క్వింటాలుకు రూ. 2,000 నుంచి రూ. 2,500 వరకు నష్టపోయి అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు తెలిపారు. రైతుల గోడును ఓపికగా విన్న కోదండ రెడ్డి స్పందిస్తూ, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంపై సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రైతులకు ఇబ్బందులు లేకుండా త్వరలోనే కొనుగోళ్లు ప్రారంభమయ్యేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీధర్, భూమాగౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ భూపాల్ గౌడ్, ఏఎంసీ సిబ్బంది భాను, పిఏసిఎస్ రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ కేసీఆర్ పాలన రావాలి

– చింతమడక రైతుల ఆకాంక్ష



సిద్దిపేట రూరల్, మే 12, (ప్రజాజ్యోతి):మళ్లీ మంచి రోజులు రావాలి... కేసీఆర్ పాలన రావాలి అంటూ చింతమడక రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు రైతులు, ఉపాధి హామీ కూలీలతో ఆత్మీయంగా మాటాముచ్చట నిర్వహించారు. గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉపాధి హామీ కూలీల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు మూడు వారాలుగా తమ కూలీ డబ్బులు రాలేదని హరీష్ రావు దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. రైతులు మాట్లాడుతూ ధాన్యాన్ని బి-గ్రేడ్ కింద నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కొనుగోళ్లు సక్రమంగా జరిగేవని, రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకునేవారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో నిర్మించిన ప్రాజెక్టులు, ఫ్యాక్టరీలకు ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రిబ్బన్ కటింగ్ చేస్తోందని రైతులు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ రైతులు, కూలీలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, మళ్లీ ప్రజల ఆశయాల ప్రభుత్వం వస్తుందని భరోసా కల్పించారు. "కేసీఆర్ గారు మళ్లీ వస్తారు... మంచి రోజులు మళ్లీ వస్తాయి" అంటూ గ్రామ ప్రజలకు ధైర్యం చెప్పారు.

## చట్టాలు పేద ప్రజలకేనా..?

సిద్దిపేట అర్బన్ , మే 12, (ప్రజాజ్యోతి):సామాన్య యువకుడిపై కేసు నమోదైతే గంటల్లో అరెస్ట్ చేసే పోలీసులు, అధికార పార్టీకి చెందిన వారిపై మాత్రం ఎందుకు మౌనం వహిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బత్తుల అభిషేక్ భాను, జిల్లా కార్యదర్శి ఆముదాల రంజిత్ రెడ్డి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు జాలిగప్ప శిరీష లు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో విద్యార్థి, మహిళా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించి, పోక్సో కేసులో నిందితుడిగా ఎఫ్ఐఆర్ నమోదైన బండి భగీరథ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల గౌరవం గురించి మాట్లాడే బీజేపీ నాయకత్వం ఇలాంటి ఘటనలపై ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. "మహిళలపై జరుగుతున్న అన్యాయాల విషయంలో స్పందించని నాయకత్వం సమాజానికి ఏ సందేశం ఇస్తోంది..?" అని ప్రశ్నించారు. తెలంగాణ సమాజం మహిళల గౌరవాన్ని కాపాడే సంస్కృతిని నమ్ముతుందని, అధికార అహంకారంతో కేసులను మేనేజ్ చేసే రాజకీయాలను ప్రజలు అంగీకరించరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు బాలమణి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు నవదీప్, హర్షవర్ధన్, కిరణ్, ఉత్తేజ్, కృష్ణ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.




# ఢిల్లీ చుట్టూ కాదు.. రైతుల చుట్టూ తిరగాలి

– రైతులను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం – బండచెర్లపల్లి కొనుగోలు కేంద్రంలో ఆకస్మిక తనిఖీ – రైతుల సమస్యలపై మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం





సిద్దిపేట రూరల్ , మే 11, (ప్రజాజ్యోతి): పంట కొనుగోలు ప్రక్రియను సక్రమంగా నిర్వహించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం బండచెర్లపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో రోజుల తరబడి పడిగాపులు కాస్తున్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ధాన్యం కుప్పల మధ్య రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలించిన హరీష్ రావు ప్రభుత్వం తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకుండా ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు. పంట కొనుగోలు ప్రక్రియను సక్రమంగా నిర్వహించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు వెంటనే కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల కష్టాలు తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న, సన్ఫ్లవర్, శనగలు విక్రయించిన రైతులకు ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని మండిపడ్డారు. మార్కెట్ యార్డుల్లో ఇంకా సగం పైగా పంట నిల్వలు పేరుకుపోయి ఉన్నాయని, రైతులు 40 రోజులుగా తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. వరి ధాన్యం తరలింపులో లారీల కొరత తీవ్ర సమస్యగా మారిందన్నారు. ఆర్టీఏ అధికారులు, వెహికల్ ఇన్స్పెక్టర్లు, పోలీసులను రంగంలోకి దించి రోడ్లపై ఖాళీగా వెళ్లే వాహనాలను వెంటనే కొనుగోలు కేంద్రాలకు మళ్లించాలని సూచించారు. యుద్ధ ప్రాతిపదికన ధాన్యం తరలింపు చేపట్టకపోతే రైతులు మరింత నష్టపోతారని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లులు ధాన్యం దించుకోవడం లేదని, దీనివల్ల కొనుగోలు కేంద్రాల వద్ద వేలాది బస్తాలు పేరుకుపోయాయని హరీష్ రావు అన్నారు. ప్రభుత్వం వెంటనే రైస్ మిల్ అసోసియేషన్లతో సమావేశమై సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతి రైస్ మిల్లు వద్ద ఒక సివిల్ సప్లై, రెవెన్యూ అధికారిని ప్రత్యేకంగా నియమించి పర్యవేక్షణ చేయాలని సూచించారు. రైతుల సమస్యలు పరిష్కరించడం మానేసి ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం, తిరుగుదాడులు చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకునే బదులు విమర్శలు చేసే వారిని లక్ష్యంగా చేసుకోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. త్వరలో వర్షాలు పడే అవకాశం ఉన్నందున పంట తడవకముందే ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని హరీష్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతులు నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని, ఈ పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. తాము అధికారంలో ఉన్న సమయంలో ఉమ్మడి మెదక్ జిల్లా అధికారులతో నిరంతర సమీక్షలు నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకున్నామని గుర్తు చేశారు. మార్చి 22న సిద్దిపేట సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 45 రోజుల్లో రైతుబంధు నిధులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని, కానీ 52 రోజులు దాటినా రైతులకు నిధులు అందలేదని హరీష్ రావు ప్రశ్నించారు. సిద్దిపేట మార్కెట్ యార్డులో మొక్కజొన్న రైతులు గన్నీ సంచుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు సంచులు అందించకపోవడంతో రైతులు బయట మార్కెట్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఎలాంటి చొరవ చూపడం లేదని హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమములో బీఆర్ ఎస్ నాయకులు , గ్రామ సర్పంచ్ , రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు విలువలు కూడా నేర్చుకోవాలి: జడ్పీ సీఈఓ ఎల్లయ్య

తూప్రాన్ (ప్రజాజ్యోతి) మే 12: తూప్రాన్ మండలం ఘనపూర్ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును మెదక్ జిల్లా పరిషత్ సీఈఓ సి. హెచ్. ఎల్లయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను సరదాకే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగించుకోవాలని సూచించారు. మంచి మార్కులతో పాటు క్రమశిక్షణ, సంస్కారం, పెద్దల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యత వంటి విలువలు కూడా ప్రతి విద్యార్థిలో పెరగాలని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు కళలు, క్రీడలు, యోగ, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి అంశాల్లోనూ ప్రతిభ కనబరచాలని ప్రోత్సహించారు. చిన్నప్పటి నుంచే సమయపాలన, పట్టుదల, ఆత్మవిశ్వాసం అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలను పాటిస్తూ మంచి మార్గంలో ముందుకు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం విద్యార్థుల్లో సృజనాత్మకత, మానసిక ఉల్లాసం పెంపొందించేందుకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నామని మండల విద్యాధికారి డా పర్వతి సత్యనారాయణ తెలిపారు. క్యాంపులో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, యోగ, డాన్స్, ఇండోర్ గేమ్స్, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఏఏపీసీ చైర్పర్సన్ కరుణశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. సమ్మర్ క్యాంప్ ప్రారంభం పాఠశాలలో ఉత్సాహభరిత వాతావరణాన్ని తీసుకొచ్చింది.

## ఐకెపి సెంటర్లు, రైస్ మిల్లులపై అధికారుల ఆకస్మిక తనిఖీలు

– వడ్ల నిల్వలు, తేమ శాతం, నాణ్యతపై అధికారుల పరిశీలన
– వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశాలు





తూప్రాన్ (ప్రజాజ్యోతి) మే 12: తూప్రాన్ మండలం యావాపూర్ గ్రామంలో మంగళవారం వడ్ల కొనుగోలు ప్రక్రియను పరిశీలించేందుకు జడ్పీ సీఈఓ ఎల్లయ్య, తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి కలిసి ఐకెపి కొనుగోలు కేంద్రం మరియు సాయినాథ్ రైస్ మిల్లును సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో వడ్ల తూకం, తేమ శాతం, నిల్వ విధానం వంటి అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులు కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేసి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. అలాగే సాయినాథ్ రైస్ మిల్లులో మిల్లింగ్ ప్రక్రియ, నిల్వ సదుపాయాలు, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

# ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామాభివృద్ధి

– ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి 26 లక్షలు – మంత్రి హరీష్ రావు



సిద్దిపేట రూరల్ , మే 12, (ప్రజాజ్యోతి):ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో పుల్లూరు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. మంగళవారం పుల్లూరు గ్రామంలో ఘనంగా జరుగుతున్న శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన హరీష్ రావు, ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి 8 లక్షలు, ఆలయ ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణానికి 18 లక్షలు కేటాయించి మొత్తం 26 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. 11 ఏళ్ల తర్వాత ఎల్లమ్మ సిద్ధోగం అంగరంగ వైభవంగా నిర్వహించబడటం ఆనందంగా ఉందన్నారు. గ్రామ ప్రజల ఐక్యత, అమ్మవారి కటాక్షంతో ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. గీత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇరిగేషన్ కాలువలు, చెరువుల ఇరువైపులా ఈత చెట్లను నాటించినట్లు తెలిపారు. గీత కార్మికుల జీవనోపాధి బలోపేతానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అంతకుముందు చింతమడక గ్రామంలో జరిగిన శ్రీ మహంకాళి అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దుర్గమ్మ ఆలయంలోనూ పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ లతా శంకర్, లతా వెంకట్, మాజీ సర్పంచ్ హంసాకేతన్ రెడ్డి, కొండల్ రెడ్డి నాగిరెడ్డి, రవి, బీఆర్ఎస్ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని మహర్షిల కళ్యాణం



టేక్మాల్ (ప్రజాజ్యోతి) మే 12:మండల పరిధిలో బొడ్మట్ పల్లిలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం రోజున వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఒడి బియ్యం పట్టు వస్త్రాలు సమర్పించి శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని ల కళ్యాణం అంగరంగ వైభవంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో చేశారు. ఈ కళ్యాణ వేడుకను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం చేసుకొని అనంతరం భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం కుటుంబ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ధర్మారం శివారులో రోడ్డు ప్రమాదం

– బైక్ అదుపుతప్పి ఆరేపల్లి వాసి మృతి



మిరుదొడ్డి, మే 12, ( ప్రజాజ్యోతి ) : మిరుదొడ్డి మండల పరిధిలోని ధర్మారం గ్రామ శివారులో సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఆరేపల్లి గ్రామానికి చెందిన గువ్వాడి సంజీవరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సంజీవరావు బెజ్జంకిలోని తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామం ఆరేపల్లికి వస్తుండగా ధర్మారం శివారులో ఈ ప్రమాదం జరిగింది. రాత్రి సమయంలో బైక్ అదుపు తప్పి కిందపడటంతో తీవ్ర గాయాలై ప్రాణాలు కోల్పోయాడు. అటుగా వెళుతున్న వాహనదారులు రోడ్డుపై పడి ఉన్న వ్యక్తిని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మిరుదొడ్డి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంజీవరావు మృతితో ఆరేపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ప్రత్యామ్నాయ పంటల సాగు పై దృష్టి సారించాలి



సిద్దిపేటఅర్బన్ , మే 12, (ప్రజాజ్యోతి) :రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు పై దృష్టి సారించాలని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం ఏన్సాన్ పల్లి గ్రామములో వ్యవసాయ పరిశోధన స్థానం తోర్నాల , సిద్దిపేట జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త ఎ. రమాదేవి మాట్లాడుతూ వివిధ పంటలలో సిఫారసు మేరకు యూరియా వినియోగం, నానో యూరియా వాడకం, నేల సంరక్షణ, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం, సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యతపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమములో అసిస్టెంట్ ప్రొఫెసర్ జె. స్పందన,వ్యవసాయ శాఖ అధికారి బి. శ్రీనాథ్,వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీమతి నవనీత, గ్రామ సర్పంచ్ వెంకటేష్, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎస్‌విఆర్ ఫంక్షన్ హాల్ నందు విద్యా వారోత్సవాల సభ

**– వెల్లడించిన మండల విద్యాధికారిని ఇందుప్రియ**



**తాండూరు మే 12 ప్రజాజ్యోతి** : 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ ఆదేశాల మేరకు నేడు కొడంగల్ రోడ్డు మార్గం లోని ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించే విద్యా వారోత్సవాల సభను విజయవంతం చేయాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి ఇందుప్రియ ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాండూరు మండలంలోని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులందరు కూడ నేడు జరుగబోయే నియోజకవర్గ స్థాయి విద్యా వారోత్సవాలను అందరి సమన్వయంతో విజయవంతం చేసేలా కృషి చేయాలని కోరారు. ఇట్టి కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జరుపబడును అని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులు తాండూర్ శాసనసభ్యులు మనోహర్ రెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు.

## బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్న డాక్టర్ టి.రితిక్ రెడ్డి





**దోమ మే 12 (ప్రజా జ్యోతి)** : మండల పరిధిలోని గూడూరు గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే టిఆర్ఆర్ తనయుడు యువ నాయకులు,పిసిసి మెంబర్ డాక్టర్ టి.రితిక్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం గ్రామ పెద్దలు,యువతతో కలిసి కార్యక్రమంలో పాల్గొని భక్తి భావాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు రితిక్ రెడ్డి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో దోమ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శాంతు కుమార్,మాజీ పిఏసిఎస్ చైర్మన్ యాదవ రెడ్డి,శివారెడ్డి పల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి మరియు గుండాల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూరులో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

- హాజరైన ఎర్రవెల్లి నాగరాజు చారి,ఇందూరి శ్రీనివాస్
- బజరంగ్ దళ్,నాగరాజు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు





**కొత్తూర్ మే 12 (ప్రజాజ్యోతి)** : కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని మారుతి హనుమాన్ ఆలయంలో బజరంగ్ దళ్, నాగరాజ్ శర్మ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయ స్వామికి వేద పండితులు తమలపాకులతో ప్రత్యేక అర్చనలు, స్వామి వారికి ఉదయం విశేష అభిషేక పూజలతోపాటు పంచ కుండాత్మక హనుమాత్ కవచహవనం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎర్రవెల్లి నాగరాజు చారి,ఇందూరి శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.ఈ పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బజరంగ్దళ్ సభ్యులు శివకుమార్ చారి,శేఖర్ గౌడ్,నరేష్ చారి,మురళి గౌడ్,హర్ష,చందు,బండి సుమన్,శివ,సందీప్ సింగ్,నాయకులు బాలకృష్ణ, సుమన్,రామకృష్ణ,చందు, శ్రీనివాస్ రెడ్డి,శ్రీ వాస్తవ, తదితరులు పాల్గొన్నారు.

## నూతన మండల, మున్సిపాలిటీ అధ్యక్షులకు సన్మానం

**శాలువా కప్పి సన్మానించిన మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇందూరి శ్రీనివాస్**





**కొత్తూర్ మే 12 (ప్రజాజ్యోతి)** : కొత్తూరు మండల, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు ఎల్లారం శేఖర్ రెడ్డి,జాండగూడెం సుదర్శన్ గౌడ్ ను శాలువా కప్పి సన్మానించిన మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇందూరి శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల, మున్సిపాలిటీ అధ్యక్షులు బాధ్యతలు చేపట్టిన శేఖర్ రెడ్డి, సుదర్శన్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మండలంలో, మరియు మున్సిపాలిటీలో మరింత బలోపేతం అవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్, మాజీ వార్డ్ సభ్యుడు గోవింద్ నాయక్, కొండారెడ్డి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# డీవీఎంసీ సమావేశాలు నిర్వహించాలి

**వికారాబాద్ జిల్లా అధికారులపై గోవింద్ నాయక్ ఆగ్రహం**



**పరిగి, మే 12 (ప్రజా జ్యోతి)** : వికారాబాద్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం (1989) ప్రకారం ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించాల్సిన డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సమావేశాలను సంవత్సరాలు గడిచినా నిర్వహించకపోవడం దురదృష్టకరమని జిల్లా డీవీఎంసీ సభ్యుడు, ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్ ఆరోపించారు. డీవీఎంసీ సమావేశాలకు జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఉండగా, ఎస్పీ, ఎమ్మెల్యేలు, కమిటీ సభ్యులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు. అయితే జిల్లాలో ఇప్పటివరకు సమావేశాలు నిర్వహించకపోవడం వల్ల బాధితులకు అందిన నష్టపరిహారం, కేసుల స్థితిగతులు ప్రజలకు తెలియకుండా పోతున్నాయని అన్నారు. అదేవిధంగా ప్రతి నెల నిర్వహించాల్సిన పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) కార్యక్రమాలను కూడా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులు పేరుకే కార్యక్రమాలు నిర్వహించి కొద్దిమందితో ఫోటోలు తీసి పంపుతున్నారని ఆరోపించారు. గ్రామాల్లో నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు డీవీఎంసీ సభ్యులను ఆహ్వానించడం లేదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపం కారణంగానే ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ ఘటనలు జరుగుతున్నాయని, దీనికి పూర్తి బాధ్యత జిల్లా అధికారులదేనని గోవింద్ నాయక్ అన్నారు. వెంటనే జిల్లా స్థాయిలో డీవీఎంసీ సమావేశం ఏర్పాటు చేసి అన్ని శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, డీఎస్పీలు, సీఐలతో సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌తో పాటు జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని జిల్లా డీవీఎంసీ కమిటీ ఆధ్వర్యంలో హెచ్చరించారు.

# 24 గంటల్లో వరి కొనుగోలు చేయాలి.. లేదంటే తాండూర్ దిగ్బంధం

- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ రైతు దీక్షలో ఘాటు విమర్శలు
- రైతు ధాన్యం తడిస్తే బాధ్యత ఎవరిది..?"
- "ఫోటోలకు మాత్రమే కొనుగోలు కేంద్రాలా..?"
- రైతు దీక్షలో మండిపడ్డ బీఆర్ఎస్ నాయకులు
- బెన్నూర్ గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి నాయకులు



**యాలాల్ (మే 12) ప్రజాజ్యోతి** : రైతులు రాత్రింబవళ్లు కష్టపడి పండించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయి ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, వచ్చే 24 గంటల్లో వరి ధాన్యం కొనుగోలు ప్రారంభించకపోతే తాండూర్ రహదారులను దిగ్బంధం చేస్తామని యాలాల మండల బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. మంగళవారం యాలాల మండలం లక్ష్మినారాయణపూర్ చౌరస్తాలో దగ్గరలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా రైతు దీక్ష నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి పిలుపుమేరకు జరిగిన ఈ రైతు దీక్షలో రాష్ట్ర కార్యదర్శి, మీడియా ఇంచార్జి పంజాగుల్ల శ్రీశైలం రెడ్డి ముఖ్యంగా పాల్గొని ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.."రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే.కానీ నేడు రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద కళ్లల్లో నీళ్లు పెట్టుకుని కాపలా కాస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు మాత్రం ఫోటోలకు ఫోజులిస్తూ కేంద్రాలను ప్రారంభించి చేతులు దులుపుకున్నారు" అంటూ మండిపడ్డారు. కొద్ది రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానుండగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతుల చెమటతో పండిన ధాన్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని,వెంటనే కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు.తాండూర్ కాగ్నా నది నీటిని ముందుగా తాండూర్ నియోజకవర్గంలోని 13 గ్రామాలకు సరఫరా చేసిన తర్వాతే కొడంగల్ నియోజకవర్గానికి తరలించాలని వారు డిమాండ్ చేశారు.తాండూర్ నియోజకవర్గంలో బయ్యాని బ్రదర్స్ ఆధ్వర్యంలో ఇసుక, ఎర్రమట్టి తదితర అక్రమ దందాలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి చేసిన సేవలను గుర్తుచేస్తూ..గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో 70 లక్షల మంది రైతులకు రైతుబంధు అందించిందని, 46 లక్షల మంది రైతులకు రైతు రుణమాఫీ చేసిందని, రైతు బీమా ద్వారా వేలాది కుటుంబాలకు అండగా నిలిచిందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5700 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు పండించిన చివరి గింజ వరకూ కొనుగోలు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ నాయకులు బెన్నూర్ గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యాలాల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, తాండూర్ పార్టీ ఇంచార్జి శ్రీశైల్ రెడ్డి, యాలాల సహకార సంఘం వైస్ చైర్మన్ వద్దె రాములు,రాజు పటేల్, మాజీ వైస్ ఎంపీపీ అనంతయ్య ముదిరాజ్, మాజీ సర్పంచ్‌లు శివకుమార్, పటేల్ రెడ్డి, రవి గౌడ్, బసిరెడ్డి, బిచ్చయ్య, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజు గౌడ్, శరణు, కొప్పుల యాదప్ప, లాలు ముదిరాజ్, శేఖర్ రెడ్డి, గణేష్, మంత్రి వెంకటయ్య, శ్రీనివాస్, కిరణ్, నారాయణ వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు,సర్పంచులు, మాజీ సర్పంచులు,మున్సిపల్ కౌన్సిలర్లు,రైతులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ సభ విజయవంతం..

**బీజేపీలో నూతన ఉత్తేజం**



**రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ (ప్రజా జ్యోతి) ప్రతినిధి** : తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు అధ్యక్షతన పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభ విజయవంతం కావడంతో తెలంగాణ బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. సభను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన ఎన్. రాంచందర్ రావును మంగళవారం నాడు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పలువురు బీజేపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి జిల్లెలగూడ 59వ డివిజన్ బీజేపీ నాయకులు వంటేరు నర్సింహ్మ రెడ్డి, జజాల మల్లారెడ్డి, కె.నాగేశ్వర్ రావు, వంగ శ్రవణ్ కుమార్ రెడ్డి, ఫణి చంద్ర కిరణ్ పాల్గొన్నారు. అలాగే బీజేపీ సీనియర్ నాయకులు, గజ్వేల్ మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్ రాష్ట్ర బీజేపీ స్పోక్స్‌పర్సన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలుడిని పరామర్శించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ (ప్రజా జ్యోతి) ప్రతినిధి** : బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేజ్–2లో వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు అద్విక్‌ను ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పరామర్శించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న శాసనసభ్యులు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్య సిబ్బందికి సూచించారు. అద్విక్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నియోజకవర్గంలో పెరుగుతున్న వీధి కుక్కల సమస్యపై సంబంధిత అధికారులతో చర్చించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## మన్సూరాబాద్‌లో మరబోయిన రఘునాథ్ యాదవ్‌కు ఘన సన్మానం



**రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ (ప్రజా జ్యోతి) ప్రతినిధి:** మన్సూరాబాద్ మధురా నగర్ కాలనీలోని పోచబోయిన రాఘవేందర్ యాదవ్ నివాసంలో తెలంగాణ రాష్ట్ర యాదవ సహకార కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమితులైన మరబోయిన రఘునాథ్ యాదవ్‌కు మన్సూరాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా పోచబోయిన జగదీష్ యాదవ్ శాలువా కప్పి అభినందనలు తెలిపారు. యాదవ సమాజ అభివృద్ధికి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ రఘునాథ్ యాదవ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పోచబోయిన రాఘవేంద్ర యాదవ్ పోచబోయిన సురేష్ యాదవ్ జనార్దన్ స్వామి పి రమేష్ యాదవ్ బొల్లు సురేష్ గచ్చి ప్రవీణ్ కే రఘు యాదవ్ నగేష్ యాదవ్ భాస్కర్ యాదవ్ నవీన్ యాదవ్ పి సాయి యాదవ్ సురేష్ యాదవ్ టక్కు యాదవ్ రాజేంద్ర యాదవ్ బి మధు గణేష్ యాదవ్ చిన్న యాదవ్ శివరాజ్ అజయ్ తదితరులు పాల్గొన్నారు పలువురు యాదవ సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి దయతో ప్రజలందరూ చల్లగా ఉండాలి

- **గూడూరు సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా**
- **ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన సర్పంచ్ దయానంద్ గుప్తా**



**కొత్తూర్ మే 12 (ప్రజాజ్యోతి)** : ఆంజనేయ స్వామి దయతో ప్రజలం దరూ చల్లగా ఉండాలని గూడూరు సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని కొత్తూరు మండలంలోని గూడూరు గ్రామంలో హనుమాన్ దేవాలయంలో సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో పిఎస్సిఎస్ చైర్మన్ పద్మారావు,మాజీ సర్పంచ్ బ్యాగరి సత్తయ్య, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సిద్దు గౌడ్,వార్డ్ సభ్యులు గట్టు లక్ష్మి చంద్రయ్య, అరవింద్ గౌడ్, దేవేందర్, గ్రామస్తులు మల్లేష్, గుండు కుమార్, గుండు బాలయ్య, ఉప్పాల రాజు, ఉప్పల మనోహర్, ఉప్పల రాఘవేందర్, గట్టు శివ లింగం, పోచయ్య, మధుసూదన్ రెడ్డి, కుమార్ గౌడ్, ఉప్పల రాజు,కాంత రెడ్డి, బిజెపి నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసి బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పిన ఈటల రాజేందర్



**రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్ (ప్రజాజ్యోతి) ప్రతినిధి:** ఎల్‌బీనగర్‌లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రాజేష్‌ను మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కామినేని ఆసుపత్రికి వెళ్లి బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.1,60,000 విలువైన చెక్కును అందజేసి కుటుంబానికి అండగా నిలిచారు. ప్రజల కష్టసుఖాల్లో ముందుండి సహాయం చేసే నాయకుడు ఈటల రాజేందర్ అని బీజేపీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ కొనియాడారు.

## మరుగుదొడ్ల నిర్వహణ అందరి బాధ్యత

- **ప్రత్యేక నిధులతో మరమ్మత్తు పనులు చేద్దాం**
- **వార్డు కౌన్సిలర్ అనిల్‌తో కలిసి పరిశీలించిన కమిషనర్**



**తాండూరు మే 12 ప్రజాజ్యోతి** : తాండూరు పురపాలక సంఘం పరిధిలో ని 6వ నంబర్ వార్డును స్థానిక కౌన్సిలర్ అనిల్ కుమార్,మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి మంగళవారం నాడు వార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు ప్రజల సౌకర్యార్థం పబ్లిక్ టాయిలెట్స్ ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. వాటిని వినియోగించు కోవడంలో అందరూ వ్యక్తిగత బాధ్యతలు తీసుకుంటేనే అందరికీ ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. ఇక్కడ మరిన్ని సౌకర్యాలు కల్పించడం కోసం ఏమైనా మరమ్మత్తు పనులు ఉంటే తక్షణమే చేసెందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పబ్లిక్ టాయిలెట్స్ వినియోగంలో వార్డు ప్రజలందరూ కూడా బాధ్యతతో ఉండాలని సూచించారు. ఇతరులకు ఇబ్బందికరంగా మారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వార్డు ప్రజలకు సూచించారు.

## రిమీడియల్ తరగతులతో విద్యార్థుల్లో నూతన ఆత్మవిశ్వాసం






**పరిగి, మే 12 (ప్రజాజ్యోతి):** పదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు విద్యా పరంగా మళ్లీ ప్రోత్సాహం కల్పించేందుకు పరిగి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నెం.1లో రిమీడియల్ క్లాసులను మండల విద్యాధికారి యం. అంజయ్య ప్రారంభించారు. విద్యార్థులు తిరిగి పరీక్షలకు సన్నద్ధమై మంచి ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా దోమ మండల ఎంఈఓ వెంకట్ మాట్లాడుతూ, విద్యార్థులు నిరుత్సాహపడకుండా ఉపాధ్యాయుల సహకారంతో కష్టపడి చదివితే తప్పకుండా విజయం సాధించగలరని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యం. గోపాల్, రమాపతి, సుభాష్, శంకర్, బాలయ్య, జంప్లతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిన్గుర్తిలో కొనసాగుతున్న కుటుంబ సర్వే

- నివాస గృహానికి ప్రత్యేక నంబర్లు
- పరిశీలిస్తున్న సూపర్ వైజర్ నాగప్ప



**తాండూరు మే 12 ప్రజాజ్యోతి** : రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న కుటుంబ సర్వేలో భాగంగా తాండూరు మండలం జిన్గుర్తి గ్రామంలో నివాస గృహాలను గుర్తించడం కోసం ఎనిమరేటర్లు ఇంటింటికి తిరిగి ప్రత్యేక నెంబర్లను కేటాయిస్తున్నారు. ఈ సందర్భంగా జిన్గుర్తి గృహ గణన సూపర్ వైజర్ నాగప్ప మాట్లాడుతూ గ్రామంలోని కొన్ని గృహాలను కలుపుకొని బ్లాకులుగా ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఇందుకోసం ఎనిమరేటర్లు ఇంటింటికి తిరిగి వాటి నివాసంలో కుటుంబాలు ఉన్నాయా లేదా అనే దానిపై ఆరా తీసి కుటుంబ సర్వే చేయడం కోసం నంబర్లు వేయడం జరుగుతుందని చెప్పారు. ఈ సర్వే నేటి వరకు కొనసాగుతుందని తదుపరి కుటుంబస్థితి గతులపై ప్రత్యేక సర్వే ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాములు, ఎనిమరేటర్లు ఉన్నారు.

## అంగరంగ వైభవంగా కాళీ దుర్గామాత 24వ వార్షికోత్సవ వేడుకలు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం
- ప్రత్యేక పూజలు, దుర్గాహోమం, అన్నప్రసాద కార్యక్రమాలు







**బోయిన్‌పల్లి, మే 12 (ప్రజా జ్యోతి)** : అన్నా నగర్, బాలంరాయి చౌరస్తాలోని ఎంఈఎస్ క్వార్టర్స్ సాపర్స్ లైన్‌లో ఉన్న శ్రీ కాళీ దుర్గాదేవి ఆలయంలో 24వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా చేపట్టారు.ఉదయం 5 గంటల నుంచి అభిషేకం, గణపతి పూజ, కుమ్కుమార్చన, దుర్గాహోమం, మహా హారతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదం పంపిణీ చేసి, మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ పూజా కార్యక్రమాలు ప్రధాన అర్చకుడు కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# సేవతోనే నర్సులకు గుర్తింపు...

### ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ శ్రీలక్ష్మి

### మెడికవర్ ఆసుపత్రిలో ఘనంగా నర్సింగ్ డే వేడుకలు

కరీంనగర్ టౌన్, మే 12 (ప్రజాజ్యోతి ) నర్సులు తమ వృత్తిని ఉద్యోగంగా కాకుండా... సేవగా భావించినప్పుడే గుర్తింపు వస్తుందని ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ శ్రీలక్ష్మి అన్నారు. వరల్డ్ నర్సింగ్ డే సందర్భంగా మంగళవారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో నర్సింగ్ సిబ్బంది వేడుకలు నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శ్రీలక్ష్మి జ్యోతిప్రజ్వలన చేసి అనంతరం కేక్ కట్‌చేసి మాట్లాడారు. ఆరోగ్య వ్యవస్థలో నర్సుల పాత్ర అత్యంత



కీలకమైందని చెప్పారు. రోగుల సేవలో నర్సులు చూపే అంకితభావం, సహనం, మానవత్వం హాస్పిటల్‌కు మంచి పేరు తీసుకొస్తాయని పేర్కొన్నారు. వైద్యులు చికిత్స అందిస్తే, ఆ చికిత్సను రోగికి సమర్థవంతంగా అందించే బాధ్యత నర్సులదేనని తెలిపారు. ప్రతి రోగిని కుటుంబ సభ్యుడిగా భావించి సేవలు అందించినప్పుడే నర్సింగ్ వృత్తికి మరింత గౌరవం పెరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. వేడుకల సందర్భంగా నర్సుల సేవలను కొనియాడుతూ పలువురు వైద్యులు అభినందనలు తెలిపారు. నర్సులు ఆరోగ్య రంగానికి వెన్నెముకలుగా నిలుస్తూ రోగులు కోలుకోవడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. చివరగా నర్సింగ్ సిబ్బందికి సన్మానం చేసి జ్ఞాపికలు అందజేశారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆద్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వినయ్, డాక్టర్ అనీష్, డాక్టర్ లోకేష్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నయన, డాక్టర్ తాహా, డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ లావణ్య, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, హెచ్‌ఆర్ మేనేజర్ ఈశ్వర్, సీఎస్‌వో గౌస్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ

ఎండపల్లి, మే 12,ప్రజా జ్యోతి ఎండపల్లి మండలం శానబండ గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు గ్రామ సర్పంచ్ గాదం భాస్కర్ , ఆధ్వర్యంలో మంగళవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పంపిణీ చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న



నేపథ్యంలో కూలీలు వడదెబ్బకు గురి కాకుండా ఈ కార్యక్రమం చేపట్టారు. ఎండ వేడిమి నుంచి తట్టుకోవడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మారుతి,ఉప సర్పంచ్ రజిత వార్డ్ సభ్యులు గాధం శ్రవణ్ ఆశ వర్కర్ విజయ సీనియర్ మెట్ తేజ, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్య వారోత్సవాలు

కొడిమ్యాల, మే 12 (ప్రజాజ్యోతి): ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్ విద్య వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి అడ్మిషన్ల ప్రచార కరపత్రా




లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రైవేట్ కళాశాలలకు దీటుగా అడ్మిషన్ల కోసం ప్రచారం చేయడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. గోపాల్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ కళాశాలలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అడ్మిషన్లు తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంగళవారం నుంచి కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు జయశీల,డా.పి తిరుపతి, నర్సయ్య, శ్యామ్ కుమార్, శ్రీకాంత్, కార్యాలయ సిబ్బంది ఎం.డి. బాబూమియా, విద్యార్థులు పాల్గొన్నారు.

# గుల్లకోటలో బడి బాట కార్యక్రమం,

ఎండపల్లి, మే 12, ప్రజా జ్యోతి తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం విద్యా వారోత్సవాలను నిర్వహిస్తోంది. దానిలో భాగంగా జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం లోని గుల్లకోట గ్రామంలో



బడి ఈడు పిల్లలను గుల్లకోట పాఠశాలలో చేర్పించ వలసిందిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందూరి రాజిరెడ్డి గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ ఉపాధ్యాయ బృందం తల్లిదండ్రులను కోరారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థులను ఆకర్షించడం జరుగుతుంది,

# గొల్లపల్లి గుట్టలపై 'మట్టి' మాఫియా పంజా

- నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు
- 'ప్రజావాణి'లో వార్డు మెంబర్ ఫిర్యాదు

గొల్లపెల్లి మే12 ప్రజాజ్యోతి జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో అక్రమ మట్టి తవ్వకాలు యధేచ్ఛగా సాగుతున్నాయి కొందరు జెసిబి గుత్తేదారులు ప్రభుత్వ ఆస్తులైన గుట్టలను నిలువునా తొలిచేస్తూ మట్టిని ఇతర ప్రాంతాలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు అధికారుల కళ్లముందే ఈ దందా సాగుతున్నా వారు పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు హోరెత్తుతున్న శబ్దాలు సోమవారం జగిత్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో గొల్లపల్లి వార్డు మెంబర్ సాంగేమ్ కళ్యాణ్ జిల్లా డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమార్కుల ఆగడాలను వివరించారు అధికారుల పర్యవేక్షణ లోపంతో గుట్టలు చెరువులు అక్రమార్కుల పాలవుతున్నాయిని పగలు నిశ్శబ్దంగా ఉంటూ రాత్రి కాగానే జెసిబిలతో గుట్టలను తవ్వేస్తూ ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారుని ట్రాక్టర్లకు అమర్చిన భారీ సౌండ్ బాక్సులతో విపరీతమైన




శబ్దాలు చేస్తూ అర్ధరాత్రి వేళ ప్రజల నిద్రకు భంగం కలిగిస్తున్నారుని అన్నారు ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారా? అన్న అనుమానం కలుగుతోంది రాత్రిపూట జెసిబిల చప్పుడుతో ఊరు ఊరంతా వణికిపోతోంది ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు ఈ అక్రమ దందాను అరికట్టాలని బాధ్యులైన గుత్తేదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని గొల్లపల్లి ప్రజలు తరపున డిమాండ్ చేస్తున్నారు ప్రజావాణిలో అందిన ఫిర్యాదుపై జిల్లా యంత్రాంగం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి

# శంకరపట్నంలో బీఆర్ఎస్ నాయకుల వరి ధాన్యం కొనుగోలు చేయాలని ధర్న

శంకరపట్నం:మే 12( ప్రజా జ్యోతి) కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని వరి ధాన్యానికి వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని




డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శంకరపట్నం మండల కేంద్రంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. మండల వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నేతృత్వంలో నిర్వహించిన ఈ ధర్నాలో రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వం వద్ద కొనుగోళ్లలో జాప్యం చేస్తుందని, తేమ శాతం పేరిట రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, "గతంలో కేసీఆర్ ప్రభుత్వం రైతులకు మద్దతుగా నిలిచింది. ఇప్పుడు వరి ధాన్యం పొలాల్లోనే ఉండిపోయింది. కొనుగోలు కేంద్రాలు సక్రమంగా తెరవడం లేదు. రైతులు రోడ్డున పడుతున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వరి ధాన్యానికి క్వింటాలుకు కనీస మద్దతు ధర ప్రకటించి, తేమ నిబంధనలు సడలించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంట మైపాల్ మాజీ జెడ్పిటిసి లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి పొద్దుటూరి సంజీవరెడ్డి సర్పంచులు , రైతు సంఘాల నేతలు, గ్రామ శాఖ నాయకులు పాల్గొన్నారు. పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

# మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా తీగల పుస్పలత

ఇల్లంతకుంట మే12 (ప్రజజ్యోతి) రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా తీగల పుష్పలత గౌడ్ ను నియమిస్తూ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత ఉత్తర్వులను మంగళవారం అందజేశారు. అనంతారం గ్రామానికి చెందిన తీగల పుష్పలత గౌడ్ మాజీ ఎంపీటీసీ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా పుష్పలత గౌడ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్య నారాయణకు, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ , ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులకు, ప్రజా ప్రతినిధులకు, పార్టీ



శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం కృషి చేస్తానని, అదేవిధంగా ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని ఆమె పేర్కొన్నారు.

# నేటి నుంచి ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు

### ..నిర్వహణకు సర్వం సిద్ధం

పెద్దపల్లి ప్రతినిధి, మే 12 ప్రజా జ్యోతి; జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 13వ తేదీ నుంచి 21వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి తెలిపారు. పరీక్షలు రెండు సెషన్లలో జరుగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండో సెషన్ నిర్వహించనున్నారు. జిల్లాలో మొత్తం 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫస్ట్ ఇయర్‌కు చెందిన 3,664 మంది విద్యార్థులు, సెకండ్ ఇయర్‌కు చెందిన 1,414 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, మొత్తం 5,078 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణ కోసం ఇద్దరు డీఈసీ సభ్యులు, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం, ఒక కస్టోడియన్‌ను నియమించినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ప్రత్యేక బస్సు రూట్లను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు సరిపడా వెలుతురు, తాగునీటి సదుపాయాలు కల్పించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి తెలిపారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు



చేరుకుని ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు.

# కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించిన

### ... ప్రభుత్వ విప్ విజయరమణరావు



పెద్దపల్లి, ప్రతినిధి మే 12 ప్రజా జ్యోతి; పెద్దహనుమాన్ జయంతి సందర్భంగా జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, హనుమాన్ భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులతో కలిసి ప్రభుత్వ విప్ విజయరమణరావు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# అంతర్జాతీయ నర్సుల దినోత్సవం.

వేములవాడ,మే,12:ప్రజాజ్యోతి. ప్రపంచవ్యాప్తంగా సంవత్సరం మే 12వ తేదీన అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకుంటారు వైద్య రంగంలో కీలకమైన వృత్తి ఈ వృత్తికి గౌరవాన్ని హుందాతనాన్ని తీసుకొచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజు సందర్భంగా ఈ రోజును అంతర్జాతీయ నర్సుల దినోత్సవం గా జరుపుకుంటారు ప్రజల ఆరోగ్య రక్షణ భద్రత విషయంలో నర్సు అందించిన తోడ్పాటును గుర్తుంచుకొని ఈ దినోత్సవాన్నిజరుపుకుంటున్నాము ప్రపంచంలోనే ఎక్కడ హాస్పిటల్ ఉన్న డాక్టర్ల వద్ద మేల్ ఫిమేల్ నర్సులు ఉండవలసింది వాళ్ళు వారి సేవలు ఎక్కువగాఉంటాయి డాక్టర్లు అన్ని సేవలు చేయలేరు ప్రతి డాక్టర్ కింద వారి హాస్పిటల్ పేరు ప్రఖ్యాతలు సంపాదించిన కొరకు మేల్ ఫిమేల్ నర్సులను 24 గంటలు ఉండే విధంగా సేవలు చేసే విధంగాఏర్పాటు చేసుకొన్నా తరువాతనే హాస్పిటల్ పెట్టుకొంటారు ఆపరేషన్ చేసిన వారికి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి అడ్మిట్ కాబడిన పేషెంట్లకు సేవలు చేయుటకు నర్సులను ఏర్పాటు చేస్తారు నర్సులు డాక్టర్ సూచించిన మందులను ఇంజక్షన్ ఇచ్చుటకు పట్టీలు కట్టుటకు ఇతర విషయాలలో వారిని వారి సేవలను ఉపయోగించుకుంటారు దానికి మూల్యం డబ్బుల రూపంలో చెల్లిస్తారు కానీ వారి సేవలు డబ్బులకు కన్నా ఎక్కువ విలువ కలిగినవి నిస్వార్థంగా నా నీ పర బెదం లేకుండా వారి డ్యూటీ ప్రకారం సమయానుకూలంగా రోగికి రోగం నివారణ కొరకు శా య శక్తుల ప్రయత్నిస్తారు వీరి సేవలను గుర్తించే ప్రపంచమంతటా ఈరోజును అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకొనుచున్నాము



# ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు,

ఎండ పల్లి, మే 12,ప్రజా జ్యోతి మండలంలోని గుల్లకోట బస్టాండ్ ఆవరణలో మంగళవారం గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ




సందర్భంగా వారు మాట్లాడుతూ.పలు గ్రామాల నుంచి ప్రయాణికులు వస్తుంటారన్నారు. అలాగే వేసవిలో గ్రామస్తులు,ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు

# కొండగట్టులో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు

వేములవాడ,మే,12:ప్రజాజ్యోతి. పెద్ద హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ అంజన్న క్షేత్రం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది



శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధర్మానికి ప్రతీకగా, అచంచలమైన సేవాభావానికి ఆదర్శంగా నిలిచిన ఆంజనేయ స్వామి వారి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని మనసారా ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని, ముఖ్యంగా రైతాంగానికి సమృద్ధిగా వానలు కురిసి పంటలు బాగా పండాలని స్వామివారిని వేడుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. హనుమంతుని భక్తి, బలం, నిస్వార్థ సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని, ప్రజాసేవలో మరింత నిబద్ధతతో ముందుకు సాగుతామని ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు..

# బస్టాండ్ కూడలి వద్దకు బస్ రావాలని గ్రామస్తుల ధర్నా4

ఇల్లంతకుంట మే 12(ప్రజజ్యోతి) రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం లోని3 పెద్దలింగాపురం గ్రామంలో సిరిసిల్ల డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు సిరిసిల్ల నుంచి ఇల్లంతకుంట కు వెళ్ళు. అర్ టి సి బస్సు తమ గ్రామంలోని బస్టాండ్ కూడలి వద్దకు వచ్చి వెళ్లాలని మంగళవారం రోజు పెద్దలిం



గపూర్ సర్పంచ్ గనేరం వసంత నర్సయ్యా ఆధ్వర్యంలో గ్రామస్తులు ఇల్లంతకుంటబస్సుకేదురుగాధర్నానిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గన్నేరం వసంత నర్సయ్య మాట్లాడుతూ మండలంలోని అతి పెద్ద గ్రామం పెద్దలింగాపూర్ గ్రామానికి గతంలో సిరిసిల్ల డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు సిరిసిల్ల నుంచి వయా పెద్దలింగాపూర్ మీదుగా ఇల్లంతకుంట వెళ్లేది.గతంలో వచ్చిన రూట్ మ్యాప్ ప్రకారంగా బస్టాండ్ మీదుగా వెళ్లాలని కోరారు. ధర్నా లో సర్పంచ్ తో పాటు ఇరవై మంది గ్రామస్తులు పాల్గొన్నారు

# రుక్మాపూర్ లో రైతుల రాస్తారోకో

చొప్పదండి, మే 12 ( ప్రజాజ్యోతి): ప్రభుత్వం ఎన్ని హామీలు ఇస్తున్నప్పటికీ మిల్లర్లు మళ్ళీ 43 కేజీల తూకం వేస్తూ తరుగు తీస్తున్నారని ఆరోపిస్తూ చొప్పదండి మండలం రుక్మాపూర్ వద్ద రాష్ట్ర రహదారిపై రుక్మాపూర్ గ్రామ రైతులు మంగళవారం గంటసేపు రాస్తారోకో నిర్వహించారు.రుక్మాపూర్ గ్రామానికి చెందిన రైతులు 200 మందికి పైగా రాష్ట్ర రహదారిపై గంటసేపు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధాన్యం కొనుగోలులో జరుగు దోపిడీ నివారించాలని డిమాండ్



చేశారు. పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ నరేష్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని, విద్యార్థులకు పోటీ పరీక్షలు ఉన్నందున వాహనాలను వెళ్ళనివ్వాలని రైతులను అభ్యర్థించి నచ్చ చెప్పి వాహనాలను పునః ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దొంతి సారపు సంపత్ మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ఎన్ని హామీలు ఇస్తున్నప్పటికీ మిల్లర్లు వినకుండా 43 కేజీలు తూకం వేస్తేనే ధాన్యం తీసుకుంటామని, లేకుంటే తీసుకోమని తెగేసి చెబుతున్నారని అన్నారు. సదరు రైస్ మిల్లర్ల పై వెంటనే చర్య తీసుకుని తరుగుదొపిడిని అరికట్టాలని, అదేవిధంగా నాణ్యమైన వడ్లను ఏ కేటగిరీలో కాకుండా బి కేటగిరీలో కొనుగోలు చేస్తూ క్వింటాలకు 20 రూపాయలు తక్కువ ధర చెల్లిస్తున్నప్పటికీ స్థానిక శాసనసభ్యులుగాని ప్రభుత్వ అధికారులు గానీ ప్రశ్నించడం లేదని ఆరోపించారు. వడ్లను ఏ కేటగిరి లో కొనుగోలు చేయాలని,తరుగుదోపిడి నివారించాలని డిమాండ్ చేశారు.

## మే 20 నుండి తెలంగాణ రక్షణ సేన జెండా పండుగలు: వైరా నియోజకవర్గ ఇన్చార్జ




**వైరా మే 12 ప్రజా జ్యోతి** తెలంగాణ రక్షణ సేన భావజాలాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు నెల రోజుల పాటు వాడవాడనా టిఆర్ఎస్ జెండా పండుగలు నిర్వహించాలని అధినేత కవితమ్మ పిలుపుమేరకు వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ గౌరవరపు జగదీష్ పార్టీ శ్రేణులకు సూచించడమైనది. ఇందులో భాగంగా మే 20 నుండి జూన్ 20 వరకు రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాలతో పాటు నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి వరకు పెద్ద ఎత్తున టీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహించడం జరుగుతుంది. అలాగే పార్టీ ఆవిర్భావ సభలో తెలిపిన పార్టీ విధానాలను, పాంచజన్య సిద్ధాంతాలను ప్రజలకు వివరించవలసిందిగా పార్టీ నాయకులను కార్యకర్తలకు సూచిస్తున్నాను. నేడు తెలంగాణ ఎదుర్కుంటున్న అనేక సమస్యలపైన ఎక్కడికక్కడ గళమెత్తవలసిందిగా పార్టీ నాయకులను కార్యకర్తలకు ఇప్పటికే సూచించడం జరిగింది. అందులో భాగంగా రాష్ట్రస్థాయి అంశాలతో పాటు స్థానిక సమస్యల పట్ల కూడా అక్కడి శ్రేణులు స్పందించడం, అవసరమైన చోట ఉద్యమించడం జరుగుతుంది. టిఆర్ఎస్ జెండా పండుగలో భాగంగా కార్యకర్తలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరువ కావలసిన అవసరం ఉంది. కలిసి వచ్చే వారిలో సమాజం పట్ల భాధ్యత, అంకితభావం కలిగిన చురుకైన కార్యకర్తలతో సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందని జగదీష్ అన్నారు.

### పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ
## ఇండ్లు బిల్లులు మంజూరు చేయండి

– మంత్రి పొంగులేటిని కలిసిన మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్





**సత్తుపల్లి మే12(ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ,సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ రహానా కమల్ మంగళవారం ఆయున చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. బొకే, శాలువాలతో ఆయునను సత్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయించిన ఇందిరమ్మ ఇండ్లు,బిల్లులు పెండింగ్లో ఉన్నాయుని, త్వరితగతిన మంజూరు చేయించాలని ఆయునకు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయున త్వరలో మంజూరు చేస్తానని,అభివృద్ధికి చేయూతగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ హాకీమ్ ఉన్నారు.

### మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో
## రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

- సీఎం రేవంత్ రెడ్డి – కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన పూర్తి చేసి వెంటనే రశీదులు ఇవ్వాలి
- స్థానిక హమాలీలను వంద శాతం వినియోగించి ఎక్కడా కొరత రాకుండా చూడాలి
- ఖాళీగా ఉన్న ట్రాక్టర్లు, డీసీఎంలు సహా అన్ని వాహనాలను రవాణాకు వినియోగించాలి
- మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి







**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** మొక్కజొన్న,ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు.మొక్కజొన్న,ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు,కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు లతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఖమ్మం ఐడీఓసీ నుండి పాల్గొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రతి ప్రైవేట్ గోదామును అవసరమైతే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని నిల్వ సదుపాయాలను పెంచాలని సూచించారు. కమ్యూనిటీ హాళ్లు,రైతు బజార్లను తాత్కాలిక షెడ్లుగా వినియోగించాలని ఆదేశించారు. అవసరమైన వాహనాల ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని సూచించారు.జిల్లాలో స్థానిక హమాలీలను వంద శాతం వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని, ఎక్కడా హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హమాలీలు అధిక మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తే వారి లైసెన్సులను రద్దు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన అనంతరం రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలని, రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు. పంట రవాణా కోసం ఖాళీగా ఉన్న అన్ని వాహనాలు, ట్రాక్టర్లు, డీసీఎం లను పూర్తి స్థాయిలో వినియోగించాలని అధికారులను ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి రోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు.పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 25 లక్షల 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపుల కోసం ఇప్పటివరకు 3 వేల 873 కోట్లను విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 కోట్ల 68 లక్షల గన్నీ సంచులను అందుబాటులో ఉంచామని,ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్లు హమాలీలు,రవాణా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు.క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఫీడ్‌బ్యాక్ అందేలా వ్యవస్థ ఉండాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ సంచులు, హమాలీలు, రవాణా వాహనాల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రైతులకు చెల్లింపులు వేగంగా జరిగేలా ట్యాబ్ ఎంట్రీలు వెంటనే పూర్తి చేయాలని సూచించారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారీగా మొక్కజొన్న దిగుబడి వచ్చిందని,రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం,మొక్కజొన్న తెలంగాణలోకి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన బందోబస్తు, విజిలెన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాల సూచనలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ కొనుగోళ్ల వేగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతున్నాయని,రాబోయే ఒక నెల అత్యంత కీలకమని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాకలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 2 లక్షల 22 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 2 లక్షల 78 వేల టన్నుల మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలకు చేరినట్లు తెలిపారు. గత వారం రోజుల్లోనే లక్షా యాభై వేల టన్నుల అదనపు నిల్వ సామర్థ్యాన్ని సృష్టించి కొనుగోళ్లు వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో డిఎస్ఓ చందన్ కుమార్, డిఆర్డిఓ శ్రీరామ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, డిసిఓ గంగాధర్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఎ.అలీం, ఇంచార్జీ డిఎం సివిల్ సప్లై సునీల్ రెడ్డి, ఆర్డీఓ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

- ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు తలెత్తితే పూర్తి బాధ్యత కలెక్టర్లదే
- గన్ని బ్యాగులు, హమాలీలు, రవాణా సదుపాయాలు అందుబాటులో ఉంచాలి
- వాహనాలు సమకూర్చని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి







**కొత్తగూడెం కలెక్టరేట్, మే 12,(ప్రజాజ్యోతి)** రాష్ట్రంలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, సీతక్క, ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కొనుగోళ్ల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కొనుగోలు కేంద్రాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గన్ని బ్యాగులు, హమాలీలు, తూకం యంత్రాలు తదితర అవసరమైన సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలని, రవాణాకు అవసరమైన లారీలను అందుబాటులో ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఒప్పందం మేరకు వాహనాలు సమకూర్చని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు.అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు, గోదాముల కొరత ఉన్న ప్రాంతాల్లో రైతు బజార్లు, ఫంక్షన్ హాల్స్ తదితర భవనాలను తాత్కాలిక నిల్వ కేంద్రాలుగా వినియోగించాలని సూచించారు. మొక్కజొన్న పంట అధికంగా పండే జిల్లాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించారు, అవసరమైన చోట పోలీస్ శాఖ సహకారంతో కొనుగోలు ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో ఎక్కడైనా సమస్యలు తలెత్తినా పూర్తి బాధ్యత సంబంధిత జిల్లా కలెక్టర్లదేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కొనుగోళ్ల పురోగతిపై ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదికలు పంపించాలని ఆదేశించారు. ఐ డి ఓ సి కార్యాలయంలో జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం, ఇబ్బందులు తలెత్తకుండా ఇకముందు ప్రతి కొనుగోలు కేంద్రానికి ప్రత్యేక అధికారులను నియమించి తగిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి కి తెలిపారు . గన్ని బ్యాగులు, హమాలీలు, రవాణా వాహనాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించేలా ప్రత్యేక ప్రణాళికతో వ్యవహరిస్తున్నా మన్నారు, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపడుతున్నామని, అవసరమైన చోట తాత్కాలిక నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ధాన్యం, మొక్కజొన్న సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, పౌరసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### నూతన వధూవరులకు
## ఎమ్మెల్యే మట్టా ఆశీర్వాదం



**సత్తుపల్లి మే12(ప్రజా జ్యోతి)** పట్టణానికి చెందిన ఇమ్మినేని కిరణ్ బాబు, నళిని కుమారి దంపతుల కుమారుడు దినేష్ కర్ణ, పూజితల వివాహ వేడుకలు సోమవారం జరిగినాయి. మంగళవారం స్థానిక శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కృషి రోడ్ లో గల స్వర్ణ ఫార్చ్యూన్ రెసిడెన్స్ వారి స్వగృహానికి వెళ్లి, నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని దీవించారు. ఆమె వెంట ఇమ్మినేని ప్రసాద్, భీమిరెడ్డి సుబ్బారెడ్డి ఉన్నారు.

### ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు
## స్వీకరించిన ఎంపిఓ రవీంద్ర ప్రసాద్



**కారేపల్లి, మే 12, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల ప్రజా పరిషత్ ఇన్చార్జి ఎంపీడీవో గా మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్ర ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. సింగరేణి ఎంపీడీవో గా పని చేస్తున్న పి శ్రీనివాసరావు పదోన్నతి పై ఖమ్మం జిల్లా పరిషత్ కార్యాలయంలో అదనపు సీఈఓ గా బదిలీపై వెళ్లారు. మంగళవారం ఇక్కడ పనిచేస్తున్న ఎంపీఓకి పూర్తి అదనపు బాధ్యతతో ఇన్చార్జి ఎండిఓగా జిల్లా కలెక్టర్ బాధ్యతలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో జిల్లా కలెక్టర్ ఇన్చార్జి ఎంపీడీవో గా బాధ్యతలు ఇచ్చినందుకు నా శక్తి వంచన లేకుండా పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

### నేడు విశ్వనాథపల్లి గ్రామపంచాయతీ
## దుకాణ సముదాయాలకు వేలంపాటలు



**కారేపల్లి, మే 12,ప్రజా జ్యోతి:** సింగరేణి మండలం విశ్వనాథపల్లి గ్రామపంచాయతీకి సంబంచిన కారేపల్లి క్రాస్ రోడ్డులో గల దుకాణ సముదాయాలకు నేడు బుధవారం వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ సర్పంచ్ ఇస్లావత్ రాజు, కార్యదర్శి నాగలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కారేపల్లి క్రాస్ రోడ్డు లోని మూడు షాపింగ్ కాంప్లెక్స్ లకు వ్యాపార పరంగా వ్యాపారాలు నిర్వహించేందుకు అవసరమైన పద్ధతిలో వాటిని ఏర్పాటు చేయడం జరిగిందని, వ్యాపారానికి సంబంధించిన వ్యాపారస్తులు బుధవారం జరిగే వేలం పాటలలో పాల్గొని దుకాణ సముదాయాలను సొంతం చేసుకోవాల్సిందిగా వారు ఈ సందర్భంగా కోరారు. ఈ వేలంపాటలకు ఎండిఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, డిపిఓ రాంబాబు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. విశ్వనాథపల్లిలోనే గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ వేలంపాటలు నిర్వహిస్తున్నారు.

## భద్రాచలంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

– దాసాంజనేయస్వామి వారికి ఏకాంత విశేష స్నపనం





**భద్రాచలం టౌన్ , మే 12 , ప్రజాజ్యోతి** భద్రాచంలో హనుమాన్ దీక్షల విరమణ మంగళవారం గనంగా జరిగింది. తెల్లవారుజామున 3 గంటలకే రామాలయాన్ని తెరిచి సుప్రభాత సేవ నిర్వహించారు. అదేవిధంగా హనుమాన్ దీక్షితులు వేకువ జాము నుంచే పవిత్ర గోదావరి నదికి చేరుకొని పుణ్య స్నానాలు ఆచరించారు. జై శ్రీరామ్. జై హనుమాన్, జై శ్రీరామ్ జైజై శ్రీరామ్ అంటూ మస్మరణతో తమ ఆరాధ్య దైవమైన భద్రాద్రి రామయ్యను దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు. హనుమాన్ దీక్షితులు తమ శిరస్సుపై ఇరుముడి ధరించి తెల్లవారుజామున మూడు గంటల నుంచే క్యూ లైన్లలో బారులు తీరారు. స్వామి వారిని దర్శించుకున్న తరువాత ఇరుముడిని అంజనే యస్వామి ఆలయంలో సమర్పించారు. కాగా దేవస్థానం అధికారులు హనుమాన్ భక్తుల కోసం శీఘ్ర దర్శనం, దేవస్థానం ఉచిత నిత్యన్నదాన సత్రంలో అన్న ప్రసాద అందిచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వరంగల్, కరీంనగర్, నిజామా బాద్, ఆదిలాబాద్ తదితర ఉమ్మడి జిల్లాల నుంచి వేల సంఖ్యలో తరలొచ్చారు. సుమారు 30 వేల మంది హనుమాన్ దీక్షితులు దర్శించుకున్నట్లు దేవస్థానం వర్గాలు అంచనా వేస్తున్నాయి. అలాగే దాసాంజనేయస్వామికి ఏకాంత విశేష స్నపనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భద్రాదలంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో కూడా దీక్షా విరమణ గావించారు. ఈ సందర్భంగా అభయాంజనేయ స్వామి ఆలయంలో వైదిక సిబ్బంది సమక్షంలో హనుమాన్ దీక్షితుల విరమణ కోసం ప్రత్యేక పూజ, హనుమత్ హోమం, సామూహిక సహస్రనామార్చన పూజలు నిర్వహించారు. హనుమాన్ భక్తులు దీక్షా విరమణ గావించారు. తాతగుడి సెంటర్లో, వెంకటేశ్వర కాలనీలోని ఆంజనేయస్వామి వారి ఆలయాల్లో కూడా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అన్నదానం నిర్వహించారు.

## ఉద్దీపకం వర్క్‌బుక్ తయారీకి ప్రణాళికలు రూపొందించాలి

భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ వెల్లడి



**భద్రాచలం టౌన్ , మే 12 ప్రజాజ్యోతి** భద్రాచలం ఐటీడీ పరిధిలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో చదివే చిన్నారులకు విద్యాభ్యాసం ప్రాథమిక స్థాయిలో పునాది బలోపేతం కావడానికి ప్రవేశపెట్టిన ఉద్దీపకం వర్క్ బుక్ సత్ఫలితాలను ఇవ్వడంతో ఈ సంవత్సరం కొద్దిగా మార్పులు చేర్పులతో ఉద్దీపకం వర్క్ బుక్ తయారీకి ప్రణాళికలు రూపొందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సంబంధిత ఎస్సిఆర్‌పిలు, ఉ పాధ్యాయులకు సూచించారు. మంగళవారం ఎస్సిఆర్‌పిలు, ఉపాధ్యాయులతో ఉద్దీపకం వర్క్ బుక్ తయారీకి ప్రణాళికలు రూపొందించడానికి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 12న పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉ ద్దీపకం వర్క్ బుక్ లో మార్పులు, చేర్పులు చేసి మూడో తరగతి పిల్లలకు వర్క్ బుక్ నిర్వహణ నిరంతరం చేస్తూ ఉండాలని అన్నారు. ఇంగ్లీష్ వర్క్ బుక్ లో కొద్దిగా స్టాండర్డ్ పెంచి పిల్లలకు అర్థమయ్యే రీతిలో సైంటిస్ట్, మహనీయులు, సైన్స్ అలాగే ప్రపంచానికి సంబంధించిన అంశాల వివరాలు పొందుపరిచి పిల్లలు చదవడం రాయడంతో పాటు సులభంగా అర్థం చేసుకుని మేధాశక్తిని పెంపొందించుకునేలా సంబంధిత ఉపాధ్యాయులు బృందాలుగా ఏర్పడి యాక్షన్ ప్లాన్ తయారుచేసి ఆగస్టు 31 వరకు ఉద్దీపకం వర్క్ బుక్ పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. పాఠశాలలు ప్రారంభమైన తర్వాత జూన్ 20వ తారీకు నాడు పిల్లలందరకు అసెస్మెంట్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇంగ్లీష్ వర్క్ బుక్ లోని అంశాలు చిత్రాల ఆధారంగా మాత్రమే ఉండాలని, తెలుగు వర్క్ బుక్ లోని అంశాలు చాలా వరకు మార్పులు చేర్పులు చేయాలని అన్నారు. అలాగే ఏడవ తరగతి ఎనిమిదో తరగతి చదువుతున్న పిల్లలకు పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని అర్థమయ్యే రీతిలో ప్రత్యేకంగా లెక్కలు మరియు ఇంగ్లీషులో వర్క్ బుక్ తయారుచేసి వారానికి రెండుసార్లు ప్రత్యేక తరగతులు నిర్వహించి పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధన జరిగేలా ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేయడం జరుగుతుందని అన్నారు. జిపిఎస్ పాఠశాల చిన్నారులతో పాటు ప్రైమరీ స్కూల్లో చదువుతున్న పిల్లలందరూ ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు పూర్తిస్థాయిలో అర్థం చేసుకొని విద్యాభ్యాసం మెరుగుపరుచుకునేల సంబంధిత ఉపాధ్యాయులు, ఎస్ సి ఆర్ పి లు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, ఏ సి ఎం ఓ రమేష్, ఎస్ సి ఆర్ పి లు మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

రంగారెడ్డి మే 12 (ప్రజా జ్యోతి)
నాగోల్‌లోని రామాలయం దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన సువర్చల సమేత ఆంజనేయ స్వామి కళ్యాణ మహోత్సవం, హనుమాన్ సువర్చల దేవి శోభాయాత్ర కార్యక్రమం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకలకు టి పీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , రాష్ట్ర అధ్యక్షుడు



ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, మహా మంగళహారతులు నిర్వహించారు. అనంతరం జరిగిన కళ్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. సాయంత్రం నిర్వహించిన హనుమాన్ సువర్చల దేవి శోభాయాత్ర భక్తి గీతాలు, మంగళ వాయిద్యాలు, జై శ్రీరామ్ నినాదాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది.
కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్త గారు మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణలో ఆలయాల పాత్ర ఎంతో గొప్పదని తెలిపారు. యువత ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హనుమంతుని భక్తి, ధైర్యం, సేవా భావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కోలన్ చంద్రశేఖర్ ఆజాద్ , భక్తులు, స్థానిక నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి వేడుకల్లో చిలుక మధుర ఉపేందర్ రెడ్డి దంపంతులు

రంగారెడ్డి మే 12 (ప్రజా జ్యోతి):
హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణ పురం, ఎన్.టి.ఆర్ నగర్ డివిజన్లలోని



హనుమాన్ దేవాలయాలను దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి దంపతులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు.

## అసోం సీఎంగా హిమంత బిశ్వశర్మ

మొదటిపేజీ తరువాయి..
లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. బిశ్వ శర్మతో పాటు బీజేపీ నుంచి ఇద్దరు, ఏజీపీ, బీపీఎఫ్ నుంచి ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడం ఇది వరుసగా మూడోసారి కాగా, అసోం ముఖ్యమంత్రిగా శర్మ పగ్గాలు చేపట్టడం రెండోసారి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, పలువురు కేంద్ర మంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహా పలువురు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు హాజరయ్యారు. హిమంత బిశ్వ శర్మతో పాటు రామేశ్వర్ తేలి, అతుల్ బోరా, చరణ్ బోరో, అజంతా నియోగ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, కొత్త టీమ్‌తో కలిసి పూర్తి అంకితభావంతో పటిష్టమైన, మరింత అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన అస్సాంను నిర్మిస్తామని శర్మ ప్రకటించారు. హిమంత బిశ్వ శర్మ తొలిసారి 2021లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. మొత్తం 126 స్థానాల్లో ఎన్డీయే 102 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 82 సీట్లు దక్కించుకోగా, భాగస్వామ్య పార్టీలైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు గెలుచుకున్నాయి. కాంగ్రెస్ సారథ్యంలోని కూటమికి 19 సీట్లు వచ్చాయి. భాజపా ఒక్కటే 82 సీట్లు గెలుచుకోగా.. దాని కూటమి భాగస్వాములైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు దక్కించుకున్నాయి. దీంతో ఎన్డీఏ రాష్ట్రంలో వరుసగా మూడోసారి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమానికి ముందు వేదిక వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. తనిఖీ చేయగా అతడి వద్ద తుటాలు లభ్యమయ్యాయి. వెంటనే అనుమానితుడిని బసిస్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టామన్నారు.

# కొనుగోళ్లలో నిర్లక్ష్యం సహించేది లేదు

### కలెక్టర్లు ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలి
### రైతులకు ఇబ్బందులు కలుగనివ్వొద్దు
### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన
### ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై సమీక్ష

సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్, మే 12(ప్రజాజ్యోతి):
రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోళ్లు , వరి ధాన్యం సేకరణ ప్రక్రియపై ముఖ్యమంత్రి మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యాన్ని ప్రభుత్వం ఏమాత్రం సహించబోదని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,అడ్లూరి లక్ష్మణ్ కుమార్,తుమ్మల నాగేశ్వర్ రావు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోలు కేంద్రాల పరిస్థితిని నిరంతరం పరిశీలించాలని సూచించారు. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా ముందస్తు



చర్యలు తీసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం రవాణాకు అవసరమైన లారీలను ఒప్పందం మేరకు అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయడానికీ వెనకాడవద్దని పేర్కొన్నారు. వాహనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశించారు.సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని సీఎం సూచించారు. గోదాముల కొరత ఉన్న ప్రాంతాల్లో రైతు బజార్లు, ఫంక్షన్ హాళ్లను తాత్కాలిక నిల్వ కేంద్రాలుగా వినియోగించాలని తెలిపారు. మొక్కజొన్న పంట అధికంగా పండే జిల్లాల్లో కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. కొనుగోళ్ల పురోగతిపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు నివేదికలు పంపాలని ఆదేశించారు.ధాన్యం లోడింగ్‌లో జాప్యం లేకుండా స్థానిక హమాలీలను గుర్తించి వినియోగించుకోవాలని, ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లారీల కొరత ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని తెలిపారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, శాశ్వత పరిష్కారాల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు.వాతావరణ శాఖ హెచ్చరికల




ఆధారంగా రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక అధికారిని నియమించాలని ఆదేశించారు.ప్రతి రైస్ మిల్లు వద్ద ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షణ చేయాలని, మిషన్ మోడ్‌లో పనిచేస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండీ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సంగీత, వ్యవసాయ, పౌర సరఫరాలు, డీఆర్‌డీఓ, మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, సహకార, రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

మొదటిపేజీ తరువాయి..
వెల్లడిస్తామని తెలిపింది. విద్యార్థుల ప్రయోజనాలు, జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. కొత్త పరీక్ష కోసం విద్యార్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, పరీక్ష ఫీజు చెల్లించనక్కర్లేదని తెలిపింది. పరీక్ష తేదీలను నిర్ణయించిన తర్వాత మళ్లీ అడ్మిట్ కార్డులు విడుదల చేస్తామని పేర్కొంది. ఇక, ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. ఈనెల 3న జరిగిన నీట్ పరీక్షలో కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును గుర్తించినట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సాల్ వెల్లడించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్‌లోని సికార్‌లో పరీక్షకు 42 గంటల ముందు వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చినట్లు గుర్తించారు. ఇందులోని సమాచారం.. నీట్ ప్రశ్నపత్రంలోని 600 మార్కుల ప్రశ్నలతో పోలి ఉండటం గమనార్హం. కొన్ని ప్రశ్నల్లోని జవాబుల క్రమం కూడా అచ్చం ఒకేలా ఉండడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఆ ప్రాక్టీసు పేపరు కేరళలోని ఓ వైద్య కళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా దర్యాప్తులో వెల్లడైంది. ఆ వ్యక్తి ఈనెల 1న సికార్‌లోని తన స్నేహితుడికి ఈ మెటీరియల్ ఇచ్చాడని.. ఆ తర్వాత అది పీజీ వసతిగృహాలు, కోచింగ్ నెట్‌వర్క్‌లు, కెరీర్ కౌన్సిలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు చేరిందని అధికారులు తెలిపారు. ఆ మెటీరియల్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించిన 300కు పైగా చేతిరాత ప్రశ్నలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని విద్యార్థులకు రూ.20వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించారని, కొందరు అభ్యర్థుల నుంచి ముందుగానే రూ.30 వేలకు పైగా వసూలుచేశారని గుర్తించామని రాజస్థాన్ పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే పలువురు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు.
పేపర్ లీక్ కేసు వ్యవహారంలో 13 మందిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వీరిని పోలీసులు విచారిస్తున్నారు. 'గెస్ పేపర్' పేరుతో మార్కెట్‌లోకి ఈ నీట్ ప్రశ్నాపత్రం వచ్చింది. ప్రభుత్వం నిర్వహించిన ప్రశ్నాపత్రంతో ఈ 'గెస్ పేపర్' 100 శాతం సరి పోలినట్లు అధికారులు గుర్తించారు. అలాగే మే 3వ తేదీన ఈ నీట్ పరీక్ష నిర్వహించగా.. అంతకు ముందే ఈ పరీక్ష పేపర్ లీక్ అయినట్లు అధికారులు ధృవీకరించారు. ఈ ప్రశ్నాపత్రం రూ. 20 వేల నుంచి రూ. 2 లక్షల వరకు విక్రయించినట్లు గుర్తించారు. కేరళలోని ఒక ఎంబీబీఎస్ విద్యార్థి వద్ద ఈ పేపర్ లీక్ అయినట్లు పోలీసులు కనుగొన్నారు. మే 1వ తేదీన సికార్‌లోని స్నేహితుడితో ఎంబీబీఎస్ విద్యార్థి ఈ ప్రశ్నాపత్రం పంచుకున్నట్లు తెలుస్తుంది. ఆ తర్వాత కోచింగ్ సెంటర్లు, అభ్యర్థులకు ఈ పేపర్ లీక్ అయినట్లు సమాచారం.

## లక్షల మంది విద్యార్థుల కలలు కల్లలు

మొదటిపేజీ తరువాయి..
ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో రాహుల్ గాంధీ ఓ ట్వీట్ చేశారు. దేశవ్యాప్తంగా 22 లక్షల మందికి పైగా విద్యార్థుల కష్టం, తల్లిదండ్రుల త్యాగాలు, ఎన్నో కుటుంబాల ఆశలు ఈ అవినీతి పాలన వల్ల నాశనమయ్యాయని రాహుల్ గాంధీ అన్నారు. కొంతమంది తండ్రులు అప్పులు చేశారని, తల్లులు తమ నగలు అమ్మారని, లక్షలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివారని, అయితే పేపర్ లీకులు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో అవినీతి వారికి శాపంలా మారాయని విమర్శించారు. ప్రతిసారి పేపర్ మాఫియా తప్పించుకుంటోందని, నిజాయతీగా చదివిన విద్యార్థులే శిక్ష అనుభవిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టం కాదు.. డబ్బు, పరిచయాలే భవిష్యత్తును నిర్ణయిస్తే విద్యకు అర్థమేంటి? ప్రధాని చెప్పే అమృత కాలం దేశ యువతకు విష కాలంగా మారింది' అని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని, పరీక్షల నిర్వహణలో కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు

## దేశంలో తగినన్ని ఇంధన నిల్వలు

న్యూఢిల్లీ,మే12(ప్రజాజ్యోతి): దేశంలో ఇంధన సరఫరాకు ఎలాంటి సమస్య లేదని, తగినన్ని క్రూడాయిల్ నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి అన్నారు. సీఐఐ వార్షిక వాణిజ్య సదస్సులో మంగళవారంనాడు ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో ప్రస్తుతం 69 రోజులకు సరిపడా క్రూడాయిల్, ఎల్ఎన్‌జీ నిల్వలు, 45 రోజులకు సరిపడా ఎల్పీజీ నిల్వలు ఉన్నాయని తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో డిమాండ్‌కు అనుగుణంగా, నిరంతరాయ సరఫరాకు వీలుగా ప్రభుత్వం ఎల్పీజీ ఉత్పత్తిని రోజుకు 35,000-36,000 టన్నుల నుంచి 54,000 టన్నులకు పెంచిందని హర్దీప్ సింగ్ పురి చెప్పారు. ఎల్పీజీ సరఫరాలో ఎలాంటి సమస్యలు లేవన్నారు. సంక్షోభాన్ని బాధ్యతాయుతంగా ఎదుర్కొంటున్నామని, ఎక్కడా ఎలాంటి డ్రై-ఔట్లు లేవని చెప్పారు. ఇంధన సరఫరా గొలుసు స్థిరంగా ఉందని స్పష్టం చేశారు. పశ్చిమాసియా సంక్షోభం నుంచి ఆర్థిక ఒత్తిళ్లను తగ్గించేందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల తగిన సూచనలు చేసినట్టు కేంద్ర మంత్రి చెప్పారు. ప్రధానమంత్రి గత ఆదివారంనాడు హైదరాబాద్‌లో తెలంగాణ బీజేపీ నిర్వహించిన సదస్సులో దేశ ప్రజలకు పలు సూచనలు చేశారు.

## భగీరథకు సిట్ నోటీసులు


మొదటిపేజీ తరువాయి..
నోటీసులు జారీ చేసింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు విచారణకు హాజరు కావాలని సిట్ అధికారులు ఆదేశించారు. సిట్ అధికారులు బుధవారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌ను విచారించనున్నారు. ఈ కేసుకు సంబంధించిన పలు అంశాలపై ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు సమాచారం. బాధితురాలి స్టేట్‌మెంట్ నమోదు చేసిన అనంతరం పోలీసులు ఈ కేసులోని సెక్షన్లను మార్చారు. గతంలో నమోదు చేసిన పోక్సో యాక్ట్ సెక్షన్లను సవరించారు.
బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ బండి



భగీరథ్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టుకు వేసవి సెలవులు కావడంతో వెకేషన్ బెంచ్‌లో పిటిషన్ వేశారు. పిటిషన్‌పై ఈనెల 14న హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరిపే అవకాశం ఉంది. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు బండి భగీరథ్ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసు సున్నితమైనది కావడంతో మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయడం జరిగింది. సిట్ ఏర్పాటు నేపథ్యంలో మరోసారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసే అవకాశం ఉంది. మరోవైపు బండి భగీరథ్ కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అన్ని ఆధారాలను సేకరిస్తున్నామని, నేరం రుజువైతే నిందితుడిని కచ్చితంగా అరెస్ట్ చేస్తామని కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ స్పష్టం చేశారు.
తన కుమారుడు బండి భగీరథ్‌ను నేరస్థుడిగా చూపే ప్రయత్నం చేస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆవేదన చెందారు. తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని చెప్పారు. బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన నేపథ్యంలో సంజయ్ స్పందించారు. ఏ తప్పూ చేయలేదని నా కుమారుడు చెబుతున్నాడు. అతడిని నేను సమర్థించడం లేదు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తా. కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తాం. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. నా కుమారుడిపై దాడిని చూసి కన్నపేగు తల్లడిల్లుతోంది.. డిప్రెషన్‌లోకి పోతోంది. నేను బాధపడుతున్నానని ప్రత్యర్థులు అనుకుంటున్నారు. నేనెప్పుడూ బాధపడను. కుట్రలు, కుతంత్రాలు చేసిన వారితో పాటు నా కుటుంబం, నా పార్టీని ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టను అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. చట్టం అందరికీ ఒక్కటేనని, తన కొడుకైనా మరెవరైనా తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు.

## తమిళ సీఎం విజయ్ సంచలన నిర్ణయం

మొదటిపేజీ తరువాయి..
వారాల్లోగా మూసివేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత విజయ్ జారీ చేసిన తొలి ఉత్తర్వు ఇది. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో టాస్మాక్ 4,765 మద్యం దుకాణాలను నిర్వహిస్తోంది. వీటిలో 276 మద్యం దుకాణాలు ప్రార్థనా స్థలాల సమీపంలో, 186 విద్యా సంస్థల సమీపంలో, 255 బస్ స్టాండ్‌ల సమీపంలో ఉన్నాయి. వీటిని వెంటనే తొలగించాలని సీఎం ఆదేశించారు. కాగా మద్యం అమ్మకాల ద్వారానే రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. అయినప్పటికీ.. ప్రజా సంక్షేమం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. 2025 సంవత్సరంలో మద్యం అమ్మకాల ద్వారా రాష్ట్రానికి రూ.48,000 కోట్ల ఆదాయం వచ్చినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇకపోతే తమిళనాట దళపతి విజయ్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వయసుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల్లో ఆయనను అభిమానించే వారు ఉన్నారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ ఏకంగా 108 స్థానాల్లో విజయం సాధించింది. రెండు రోజుల క్రితం విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీకి వెళ్లారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్



ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే తమిళనాడు సీఎంఓ ఆఫీస్ సోషల్ మీడియా ఖాతాల డీపీలు మారాయి. ముఖ్యమంత్రి విజయ్ ఫొటోలను డీపీలుగా పెట్టారు. విజయ్ ఫొటో డీపీగా పెట్టిన గంటల్లోనే మ్యాజిక్ జరిగింది. సోషల్ మీడియా ఖాతాలకు ఫాలోవర్స్ క్యూ కట్టారు. తమిళనాడు సీఎంఓ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు మొదట 4 లక్షల ఫాలోవర్స్ ఉండేవారు. విజయ్ ఫొటో పెట్టిన తర్వాత 16 లక్షలకు ఫాలోవర్స్ సంఖ్య పెరిగింది. ఇక ఎక్స్ ఖాతాకు కూడా 4 లక్షల మంది ఫాలోవర్స్ ఉండేవారు. ఇప్పుడు 22 లక్షల మంది అయ్యారు. అందుకే ఆయన తీసుకునే నిర్ణయాలకు ప్రజలు జై కొడుతున్నారు.
ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పార్టీని స్థాపించామని తెలిపిన టీవీకే, ప్రజలు ఇబ్బంది పడే పనులకు దూరంగా ఉండాలని స్పష్టం చేసింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి ఎన్. ఆనంద్ ఒక అధికారిక ప్రకటనను విడుదల చేశారు. నాయకుల పుట్టినరోజులు లేదా కుటుంబ వేడుకల సందర్భాల్లో వీధులు, బహిరంగ ప్రదేశాలు, జనసమూహం ఉన్న చోట లేదా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఎలాంటి బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని పార్టీ కార్యకర్తలను ఆదేశించింది. అంతేగాకుండా.. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఎలాంటి వేడుకలు జరపకూడదని, ఒకవేళ పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజయ్ నిర్ణయించినట్లు పార్టీ ప్రకటించింది. ప్రజలు మనపై ఎంతో నమ్మకం ఉంచారని, ఆ నమ్మకాన్ని కాపాడుకుంటూ బాధ్యతాయుతంగా నడుచుకోవాలని కార్యకర్తలకు సూచించింది. తమిళనాడు అభివృద్ధి కోసం పయనిస్తున్న తరుణంలో, ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగించే చర్యలను ఏమాత్రం సహించబోమని ఈ ప్రకటన ద్వారా టీవీకే గట్టి హెచ్చరిక జారీ చేసింది.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967